# రవీంద్రనాథ ఠాకూర్



మహాదేళ్ళక్రితం హరిమతి తన కూతురు వినోదినిని, తన బాల్యస్నేహితురాలైన రాజలక్ష్మికొడుకు మహేంద్రుడి కిచ్చి చెయ్యాలని ప్రయత్నించింది

"పాపం, పేదయింటి పిల్లరా! అందంగా ఉంటుందట. పెళ్ళి చేసుకోరాదూ?" అని రాజలక్ష్మి కొడుకుతో అన్నది.

మహేంద్రుడు ఇరవై ఏళ్ళవాడు. ఎమ్మే పాసై వైద్యవిద్య అభ్యసిస్తున్నాడు. అతను తల్లి ప్రోద్బలంచేత మొదట పిల్లను చూడటానికి ఒప్పుకున్నా, తీరా పెళ్ళి చూపులు దగ్గిరపడేసరికి, "నిన్ను సంతోషపెట్టటానికి పెళ్ళాడేటప్పుడు, మళ్ళీ పెళ్ళిచూపులుకూడా ఎందుకులే," అని కొంచెం దెప్పుతూ అన్నాడు. పెళ్ళిలో తెర తొలగించగానే పెళ్ళికూతురు ముఖం చూసి తనకొడుకు తనలాగే మెత్తబడిపోతా డనుకుని రాజలక్ష్మి పెళ్ళిముహూర్తంకూడా పెట్టించింది. ఆ ముహూర్తం దగ్గిరపడేసరికి మహేంద్రుడు ససేమిరా తనకు పెళ్ళి వద్దనేశాడు.

మహేంద్రుడికి చిన్నతనంనుంచీ నీడలాగా ఉంటూ తిరిగే బిహారీ అనే కుర్రాడొకడున్నాడు. వాడు మహేంద్రుణ్ణి అన్నా అనీ, రాజలక్ష్మిని అమ్మా అనీ పిలుస్తూండేవాడు రాజలక్ష్మి బిహారీతో, "బాబూ, ఆ పిల్లను నువ్వయినా పెళ్ళాడరా. పాపం, పేదయింటిపిల్ల –" అన్నది.

"అమ్మా, మహేంద్రుడికి పనికిరాని మిఠాయి పెడితే తింటానుగాని, పెళ్ళి విషయంలో ఎలా కుదురుతుంది ?" అన్నాడు బిహారీ.

వినోదిని తండ్రి అంత ధనవంతుడు కాకపోయినా, ఒక్క కూతురే కావటం చేత, ఆమెకి దొరసానిని పెట్టి చదువు చెప్పించి, కుట్టూ, అల్లికా నేర్పించాడు. పిల్ల వయసు మీరిపోతున్నా ఆమె పెళ్ళి గురించి ఆయన చీమ కుట్టినట్టయినా బాధపడలేదు. చివరకు రాజలక్ష్మి తన కన్నవారి ఊరైన బారాశత గ్రామంలోనే ఒక సంబంధం చూసి పెళ్లి చేయించేసింది.

పెళ్ళి అయిన కొద్దికాలానికే వినోదినికి వైధవ్యం సంప్రాప్తమయింది

ఇప్పటి కింకా మహేంద్రుడు పెళ్ళి చేసుకునే దారిలో లేడు.

"కోడలు వచ్చి కొడుకును బుట్టలో వేసుకుంటుందని భయపడి నేను నీకు పెళ్ళి చెయ్యటం లేదని అందరూ న న్నాడిపోసుకుంటున్నారురా !" అన్నది రాజలక్ష్మి మహేంద్రుడితో.

"కోడలు వస్తే కొడుకును తప్పక తన కొంగుకు కట్టుకు కూర్చుంటుంది నేనే తల్లినైతే చచ్చినా కొడుక్కి పెళ్ళి చెయ్యను," అన్నాడు మహేంద్రుడు.

ఆ సమయంలో రాజలక్ష్మి తోడికోడలు అన్నపూర్ణ నచ్చి, "ఈడువచ్చినవాడు. ఇంకా ఎంతకాలం తల్లికొంగు పట్టుకు కూర్చుంటాడు ? ఏ ఈడుకు తగినట్టు ఆ యీడులో ఉండాలిగాని, పీడిలాగా ఉండటం సిగ్గుచేటు," అన్నది.

ఆమె ఆమాట సద్భావంతోనే అన్నప్పటికీ, రాజలక్ష్మి సహించలేక, "నా కొడుకు పెళ్ళి చేసుకోలేదని నీ కెందుకు బెంగ ? వాడి సంగతి నే చూసుకోగలను. ఇందులో అడ్డమైనవాళ్ళ జోక్యమూ అవసరం లేదు," అని చాచి కొట్టినట్టుగా అన్నది.

అన్నపూర్ణ చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. మహేంద్రుడు చాలా నొచ్చుకున్నాడు. ఆమె నెలాగైనా ఉపశమింపచేసే ఉద్దేశంతో అతను ఆ సాయంకాలం ఆమెవద్దకు వెళ్ళి, "పిన్నీ, ఇదివర కొకసారి మీ చెల్లెలి కూతురు గురించి చెప్పావే, ఆ పిల్లను చూడటానికి ఏర్పాటు చేస్తావా ఏమిటి ?" అన్నాడు.

అన్నపూర్ణకు చెల్లెలికూతు రొకతె ఉన్నది. ఆ పిల్లకు తల్లీ, తండ్రీ లేరు.

అన్నపూర్ణకు బిడ్డాపాపా లేకపోవటంచేత ఆ పిల్లను మహేంద్రుడి కిచ్చి చేసి, తనదగ్గిరే ఉంచుకుందామని ఆమె ఉద్దేశం.

"నీ కిప్పుడు పెళ్ళిమీద ధ్యాస మళ్ళిందా ఏం?" అన్నది అన్నపూర్ణ నవ్వుతూ.

"నా కోసం కాదు పిన్నీ, బిహారీని ఒప్పిస్తాను. పెళ్ళిచూపులకు మంచిరోజు చూసి ఏర్పాటు చేయించు," అన్నాడు మహేంద్రుడు.

తా నీ మాట అన్న సంగతి మహేంద్రుడు అప్పుడే మరిచాడుగాని, అన్నపూర్ణ మరవలేదు. పిల్ల శాంబజారులో పెత్తండ్రి ఇంట ఉంటున్నది. అన్నపూర్ణ అక్కడికి కబురుపంపి పెళ్ళిచూపులకు ఏర్పాటు చేయించింది.

మహేంద్రు డీ సంగతి తెలిసి కంగారుపడ్డాడు. అతను బిహారీని పిలిచి, సంగతంతా చెప్పి, "పెళ్ళిచూపులకు పద, మరేమీ భయంలేదు, పిల్ల నచ్చకపోతే నువు పెళ్ళాడ నవసరం లేదు," అన్నాడు.

"తీరా పెళ్ళిచూపులకు వెళ్ళి పిల్ల నచ్చలేదంటే పిన్ని ఏమనుకుంటుంది?" అన్నాడు బిహారీ మొహమాటంగా.

"అయితే ఏం చేస్తా నంటావు?"

"నన్నడ్డం పెట్టి నువు వాళ్ళకు ఆశపెట్టావు గనక నే నా పిల్లను నోరుమూసుకుని పెళ్ళాడేస్తాను. ఇంకా చూడటమూ, చెందటమూకూడా దేనికీ?"

బిహారీ ఇలా అన్నట్టు తెలిసి అన్నపూర్ణ అతన్ని పిలిపించి. "చూడు బాబూ, పెళ్ళిచూపులు జరగకుండా పెళ్ళి జరగదు. పిల్ల నీ కేమాత్రం నచ్చకపోయినా పెళ్ళాడకు,'' అన్నది.

పెళ్ళి చూపులకు బిహారీవెంట బయలుదేరుతూ మహేంద్రుడు మంచి బట్టలు వేసుకుని, జుట్టు నున్నగా ఎగదువ్వి, కాస్త అత్తరుకూడా రాచుకున్నాడు.

పిల్ల శాంబజారులో తన పెత్తండ్రి అయిన అనుకూలబాబుఇంట ఉంటున్నది. అనుకూలబాబు పేట నడిమయాన, చుట్టూ తోటగల మూడంతస్తుల భవంతి కట్టించి అందులో ఉంటున్నాడు. తల్లిదండ్రులులేని ఆ పిల్లను అన్నపూర్ణ తనవద్ద ఉంచుకుంటానంటే, తన ఆత్మగౌరవానికి భంగమనిపించి ఆయన ఒప్పుకోలేదు.

పెళ్ళిచూపులకు వచ్చిన కుర్రాళ్ళకు ఫలహారం పెట్టారు. పెత్తండ్రి కేక పెట్టిన మీదట పెళ్ళికావలిసినపిల్ల పాందాను తెచ్చి అతిథులముందు పెట్టింది.

అనుకూలబాబు బిహారీతో, "బిహారీబాబూ, ఈ పిల్ల నా చిన్నతమ్ముడు అపూర్వుడి కూతురు. వాడేమో పోయాడు; ఇప్పుడు దీనికి నేను తప్ప ఇంకెవ్వరూలేరు," అని నిట్టూర్చాడు.

ఆ మాట వింటూంటే మహేంద్రుడి హృదయం ద్రవించింది. అత నామె ముఖం కేసి మరింత బాగా చూసి, "నీ పేరేమిటి?" అన్నాడు.

"ఆశాలత," అన్న దామె ముఖం ఎత్తకుండానే.

ఆమెను చూస్తే మహేంద్రుడి కెంతో జాలికలిగింది. ఆమె కంఠధ్వని ఎంతో కోమలంగా ఉన్నది పాపం, దిక్కులేనిపిల్ల!

ఇద్దరూ ఇంటికి తిరిగివచ్చేటప్పుడు మహేంద్రుడు, ''బిహారీ, ఈ సంబంధం పోనీకు, ఈ పెళ్ళి నీకు భారంగా తోచటం లేదనుకుంటా," అన్నాడు.

"లేదు, మోయదగిన బరువనే తోస్తూంది," అన్నాడు బిహారి.

"భారమని తోస్తే చెప్పు, నేను భుజాలమీద వేసుకుంటాను."

''మహేన్‌దా, ఇది నిజంగా అన్నమాటేనా? చెప్పు. నువ్వీ పిల్లను పెళ్ళాడే టట్టుంటే పిన్ని చాలా సంతోషిస్తుంది, ఆమెను శాశ్వతంగా తన దగ్గరే ఉంచుకో గలుగుతుంది," అన్నాడు బిహారి.

"నీ కేమన్నా పిచ్చా యేం? అలా జరిగే మాటుంటే ఏనాడో జరిగేది, ఇంత కాలం ఆగేదా?" అన్నాడు మహేంద్రుడు.

బిహారి తన యింటికి వెళ్ళిపోయాడు. మహేంద్రుడు మేడమీదికి వెళ్ళి, చాప పరుచుకుని పడుకున్నాడు. ఆ రాత్రి అతనికి సరిగా నిద్రపట్టలేదు మర్నాడు పొద్దున అతను బిహారి ఇంటికి వెళ్ళి, "రాత్రంతా ఆలోచించాను. పిన్ని కోరినట్టు ఆశను నేనే పెళ్ళాడ నిశ్చయించాను," అన్నాడు.

"ఈ నిర్ణయం నిన్ననే చేసిఉంటే బాగుండేది," అన్నాడు బిహారి.

"ఒక్కరోజు ఆలస్యమైతే కొంప మునిగిందా?" అని చెప్పి, మహేంద్రుడు తన తల్లిదగ్గిరికి వచ్చి, "అమ్మా, నీ కోరిక ప్రకారం పెళ్ళాడటానికి సిద్ధంగా ఉన్నాను," అన్నాడు.

"సరే, తగిన సంబంధం చూస్తాను," అన్నది రాజలక్ష్మి.

"పెళ్ళిచూపు లయాయి," అంటూ మహేంద్రుడు తల్లికి అంతా చెప్పాడు.

"ఆ పిల్ల నీకువద్దు బాబూ. దానికి ఎటూ ఎవరూ లేరు. దిక్కులేని పిల్ల, అన్నది తల్లి.

"ఆ పిల్ల నాకు బాగా నచ్చిందమ్మా."

కొడుకు పట్టుదలచూసి మండిపోయి రాజలక్ష్మి తన తోడికోడలు అన్నపూర్ణ దగ్గరికి వెళ్ళి, "దిక్కులేని పిల్లను తెచ్చి అంటగట్టి, నా కొడుకును నాకు కాకుండా చేయాలనుకుంటున్నావా? ఎంత రాకాసివే!'' అన్నది.

"మహేంద్రుడి పెళ్ళి ప్రసక్తే రాలేదే. వాడు నీ కేం చెప్పాడో," అన్నది అన్నపూర్ణ. ఆమె బిహారీని పిలిపించి, "నీ పెళ్ళికి అంతా నిశ్చయమయిందికదా; అంతా తారుమారు చేస్తున్నావా? దాన్ని నువే పెళ్ళాడాలి, లేకపోతే నా పరువు దక్కదు," అని చెప్పింది.

బిహారి రాజలక్ష్మి దగ్గిరికి వచ్చి, "అమ్మా, పిన్ని చెల్లెలి కూతుర్ని నేను పెళ్ళాడటానికి అంతా నిశ్చయమయింది. నీతో చెబుదామని వచ్చాను. నా కిం కెవరున్నారు?" అన్నాడు.

"చాలా సంతోషం, బాబూ. పిల్ల లక్ష్మీదేవిలాటిది. మీ రిద్దరూ ఈడూజోడుగా ఉంటారు. సంబంధం తప్పిపోనివ్వకు," అన్నది రాజలక్ష్మి.

మహేంద్రుడు, తల్లిమీద పట్టరాని కోపంవచ్చి, అలిగి ఇంటినుంచి వెళ్ళిపోయి, విద్యార్థుల హాస్టలులో మకాం పెట్టాడు. రాజలక్ష్మి తన కొడుకును రక్షించమనీ, ఎలాగైనా ఆమె చెల్లెలి కూతుర్ని వాడి కిచ్చి పెళ్ళి చేయించమనీ అన్నది.

"బిహారీతో సంబంధం నిశ్చయ మయిపోయింది," అన్నది అన్నపూర్ణ.

రాజలక్ష్మి బిహారీని పిలిపించి, "బాబూ, ఈ సంబంధం మానుకో. ఈ పిల్ల నీకు తగదు. నీకోసం మంచి పిల్లను చూసిపెడతాను," అన్నది. బిహారీ అలా జరగటానికి వీల్లే దన్నాడు. రాజలక్ష్మి అన్నపూర్ణ కాళ్ళావేళ్ళా పడి, ఒట్లు వేసి, బిహారీని ఈ పెళ్ళి మానమని చెప్పించింది. మెత్తని మనసుగల అన్నపూర్ణ సిగ్గు పడుతూ బిహారీతో చెప్పింది.

"నువెట్లా చెబితే అట్లా చేస్తాను, పిన్నీ. కాని ఇక ముం దెన్నడూ ఏ పిల్లను గాని పెళ్ళాడ మని నన్ను బలవంతపెట్టకు," అన్నాడు బిహారి.

ఈ విధంగా మహేంద్రుడికీ, ఆశాలతకూ పెళ్ళి జరిగింది. అన్నపూర్ణకు దగ్గిర అయానన్న సంతోషంతో ఆశ కాపరాని కొచ్చింది. కాని ఈ కాపరంలో కాటకాలున్నాయని ఆమె ఎరగదు.

కొద్దిరోజులకు రాజలక్ష్మి కొడుకుతో, "ఒక ఏడాదిపాటు కోడలు వాళ్ళ పెత్తండ్రి ఇంటనే ఉండటం మంచిదనుకుంటా," అన్నది.

"ఎందుకమ్మా?" అన్నాడు మహేంద్రుడు.

"నీకు చదువు సాగవద్దూ?"

"ఆ సంగతి నేను చూసుకోలేనూ? తల్లీ తండ్రీ దగ్గిరఉన్న దారివేరూ, పెత్తండ్రి దగ్గిరఉన్న దారివేరూ. నేను పంపను."

రాజలక్ష్మి కోడలికి ఇంటిపనులు ఉత్సాహంగా నేర్ప నారంభించింది. కోడలు

పగలల్లా వంటింటోనో, సామాను గదిలోనో, పూజామందిరంలోనో ఉంటుంది. రాత్రి అత్తగా రామెను తన పక్కలోనే పడుకోబెట్టుకుని, ఆ పిల్లకు తనవా ళ్ళెవరూ లేరన్న సంగతి జ్ఞాపకం రాకుండా చేస్తున్నది. అన్నపూర్ణ తన చెల్లెలి కూతురికి వీలయినంత దూరంగా ఉంటున్నది.

మహేంద్రుడు అన్నపూర్ణదగ్గిరకి వెళ్ళి, తన తల్లి కోడలిని అస్తమానమూ పనిలో పెట్టి రాపాడుతున్నదని ఫిర్యాదు చేశాడు. ఇంటి కోడలికి ఇంటిపనులు నేర్పడం మంచిదేకదా అన్నది అన్నపూర్ణ. అన్నపూర్ణతో కొడుకు మాట్లాడటం చెవినపడి రాజలక్ష్మి వచ్చి, "ఏవిషయం చర్చిస్తున్నారు?" అని అడిగింది.

"చర్చ ఏముందీ? కోడలిని పనిదానిలాగా ఉపయోగించడం నా కిష్టంలేదు," అన్నాడు మహేంద్రుడు ఉద్రేకంగా.

"దాన్ని ఏం చేద్దామని?" అని తల్లి అడిగింది.

"చదువు చెబుతాను," అన్నాడు మహేంద్రుడు.

రాజలక్ష్మి వెంటనే వెళ్ళి కోడలిని రెక్కపట్టుకు తీసుకొచ్చి, "ఇదుగో నీభార్య, చదువు చెప్పుకో," అన్నది. తరవాత కొంగు మెడకు చుట్టుకుని అన్నపూర్ణకు దణ్ణంపెట్టి, "క్షమించు, చెల్లీ! నీ చెల్లెలికూతురి మర్యాద తెలుసుకోలేక, ఆవిడ చెయ్యి పసుపుచేశాను. ఆ మరక కడిగి దొరసానిని చేసి మహేంద్రుడి కియ్యి. దాసీ దానిపని నేనే చేస్తా," అని తన భాగంలోకి వెళ్ళి, దభాల్న తలుపు వేసుకున్నది.

అన్నపూర్ణ కలవరపడి చతికిలబడిపోయింది. ఈ గృహకల్లోలం అకస్మాత్తుగా ఎందుకు కలిగినదీ తెలీక ఆశ తెల్లబోయింది. మహేంద్రుడు మండిపడుతూ, ఇక తన భార్య బాధ్యత తన చెయ్యిదాటి పోరాదనుకున్నాడు అతను చదువుకూ, పరీక్షలకూ, ఇతర పనులకూ అన్నింటికీ స్వస్తి చెప్పి భార్యతో ఇంట్లోనే ఉండిపోయాడు.

తన కొడుకు వచ్చి క్షమాపణ కోరుతా డనుకున్నది రాజలక్ష్మి. అలా జరగలేదు తానే వెళ్ళి క్షమించివద్దా మనుకున్నది. మహేంద్రుడు కాలేజీకి వెళ్ళిఉండేసమయంలో వాడి గదిఅంతా సర్ది, తాను క్షమించినట్టు వాడికి తెలియబరుద్దామని మూడో అంతస్తుకు వెళ్ళింది. మహేంద్రుడు కాలేజికి వెళ్ళలేదు. గదిలో భార్యాభర్త లుండడం చూసి, చడీచప్పుడు లేకుండా రాజలక్ష్మి కిందికి దిగివచ్చింది.

## 2

తన కోడలి వాలకం చూసి రాజలక్ష్మి అన్నపూర్ణపైన విరుచుకుపడింది. "నీ కోడలిని నువు శిక్షించుకోక నాతో ఎందుకు చెబుతావు?" అన్నది అన్నపూర్ణ.

"నీ మంత్రాంగం ఉండగా అది నన్నేం లెక్కచేస్తుంది?" అన్నది రాజలక్ష్మి.

అన్నపూర్ణ గబగబా మేడమీదికి వెళ్ళి ఆశను ముక్కచివాట్లు పెట్టింది; "దౌర్భాగ్యురాలా, నీ మూలాన నాకు తలవంపుగా వుంది. నీకు సిగ్గూ, బిడియమూ లేదు పెద్దది, అత్తగారిమీద ఇంటిపని అంతా వేసి, ఇక్కడ కులుకుతున్నావా?" అంటూ జలజలా కన్నీరు కార్చింది.

"పిన్నీ, కోడలి తప్పేమీలేదు; చదువుకోమని నేనే పట్టివుంచాను," అన్నాడు మహేంద్రుడు. అన్నపూర్ణ వెంట తన భార్య కిందికి వెళ్ళబోతుంటే అతను వెళ్ళనివ్వక ఆపాడు.

దగ్గరవాళ్ళదగ్గర పెరిగినా ఆశకు ఆత్మీయతా, అధికారమూ లేకపోయాయి కాని ఈ పరాయి ఇంట ఆమెకు రెండూ లభించాయి. మహేంద్రుడామె నెత్తిన కిరీటం పెట్టి సింహాసనంమీద కూర్చోబెట్టాడు ఆమె కొత్తకోడలికి ఉండదగిన భయసంకోచాలు విసర్జించి, ఇల్లాలితనం అవలంబించి నిస్సంకోచంగా ఆ సింహాసనంపైన కూర్చున్నది. ఆమె అతనిదగ్గర చదువుకోవటమనేది కేవలమూ వేడుక. ఆమెకు చదువు ఒక్క అక్షరం అంటకపోగా ఆమె మూలాన మహేంద్రుడి చదువుకూడా మూలపడింది.

పానకంలో పుడకలాగా అప్పుడప్పుడూ బిహారీ వచ్చి "మహేన్‌దా!" అని పోలికేకలు పెట్టేవాడు. ఆశతో, "అంతా ఒక్కసారే తింటే అరగదు కొంచెం కొంచెంగా నమిలి తినాలి," అని ఎత్తిపొడిచేవాడు.

"చునీ, వాడిమాట వినకు వాడు మన సుఖం చూసి ఓర్చలేకుండా ఉన్నాడు," అని మహేంద్రుడు ఆశతో అనేవాడు. 'చునీ' ఆశకు ముద్దుపేరు. అలా మాట్లాడతాడని ఆశకు బిహారీమీద కోపం.

మహేంద్రుడు పరీక్ష తప్పాడు. రాజలక్ష్మికి మంటెత్తుకొచ్చింది. ఆ అగ్ని జ్వాలలను భరించలేక అన్నపూర్ణ తన మేనత్తకొడుకు దగ్గిరికి వెళ్ళిపోయింది. ఆశ ఏడుస్తూ కూర్చున్నది. అది చూసి, "మనంకూడా అక్కడికే పోదాం," అంటూ మహేంద్రుడు మూటాముల్లే సర్ద నారంభించాడు.

ఇది పసిగట్టి రాజలక్ష్మి కొడుకుదగ్గిరికి వచ్చి, "ఎక్కడికి ప్రయాణం?" అని అడిగింది. చాలాసేపు సమాధానం చెప్పక చివర కతను, "పిన్ని దగ్గిరికి," అన్నాడు

"మీ రెక్కడికీ వెళ్ళక్కర్లేదు మీ పిన్నినే తీసుకొస్తాను," అని రాజలక్ష్మి మేనా చేయించుకుని అన్నపూర్ణ ఉన్నచోటికి వెళ్ళి, చీరచెంగు మెడకు చుట్టుకుని,

దణ్ణంపెట్టి, "క్షమించు, చెల్లీ, క్షమించు!" అన్నది.

"నే నేం అపచారం చేశాను? ఏం చెయ్యమంటావు?" అన్నది అన్నపూర్ణ కంగారుగా. రాజలక్ష్మి అభిమానావమానాలతో భోరున ఏడ్చి, అన్నపూర్ణను ఇంటికి తెచ్చింది. అన్నపూర్ణ ఇంటికి వచ్చి, ఆశతో. "చునీ, నీ మూలంగా ఇంట్లో ఉండటానికీలేదు. ఎక్కడికైనా పోవటానికీలేదు. ఎక్కడా నాకు శాంతి లేకుండా చేస్తున్నావు!" అన్నది.

మర్నాడే రాజలక్ష్మి బిహారీని పిలిచి తనకు పుట్టినవూరు పోవాలని ఉన్నట్టు చెప్పింది. బిహారి వెళ్ళి మహేంద్రుడితో ఈమాట చెప్పాడు

"అమ్మ బారాశతకు వెళ్ళా లనిపించటం సహజమే. కాని ఈ వానాకాలంలో అక్కడ ఎక్కువరోజు లుండటం మంచిదికాదు," అన్నాడు మహేంద్రుడు.

"అమ్మ ఒక్కతే ఎలా వెళుతుంది? వదినెనుకూడా పంపు," అన్నాడు బిహారి. అది కుదరదు లెమ్మన్నాడు మహేంద్రుడు. అతను తల్లి ప్రయాణానికి అంత తేలికగా ఒప్పుకోవటం చూసి బిహారి ఆశ్చర్యపోయాడు.

నిజానికి రాజలక్ష్మి బారాశతకు పోవాలని తహతహ లాడటంలేదు. క్రమంగా వట్టిపోయే తల్లికొడుకు సంబంధం ఎంత లోతున్నదీ గడవేసి చూసింది. అన్నపూర్ణ ఇల్లువదిలి వెళ్ళిపోతే జరిగిన హంగామా తాను వెళితే లేదు. 'అది మంత్రాలు తెలిసిన రాక్షసి. నేను వట్టి తల్లిని,' అనుకున్నది.

ఆమె మధ్యాన్నంవేళ ప్రయాణం కావటానికి నిశ్చయించుకున్నది. కొడుకు ఆమెను బారాశతలో దిగబెట్టివస్తాడని అందరూ సహజంగా అనుకున్నారు. కాని, ప్రయాణంవేళకు బిహారి వచ్చేసరికి మహేంద్రు డా ప్రయత్నంలో లేడు.

"నువ్వింకా సిద్ధం కాలేదేం?" అని బిహారి అడిగాడు.

"నాకు మరి కాలేజి— '

"సరే, అమ్మను నేను దిగబెట్టివస్తాను," అన్నాడు బిహారీ.

రాజలక్ష్మి వెళ్ళిపోయింది, అన్నపూర్ణ వెళ్ళిపోలేదు గాని, దూరం దూరంగా ఉంటూ వచ్చింది. మహేంద్రుడికీ, ఆశకూ అభిమానం వచ్చింది.

బిహారి రాజలక్ష్మి వెంట బారాశత చేరుతునే, "అమ్మా, కలకత్తా పోదాం పద," అన్నాడు. ఊరికి నాలుగువైపులా కీకారణ్యం. ఎక్కడ చూసినా వెదురు పొదలు. పగలే నక్కలు కూస్తున్నాయి. రాజలక్ష్మి పుట్టింట శతవృద్ధులైన ఇద్దరు వితంతువులు మాత్రమే బతికిఉన్నారు.

అటువంటి చోటినుంచి రాజలక్ష్మిని తిరిగిపోకుండా చేసినది వినోదిని. భర్త

చనిపోయినా వినోదిని ఆ కుగ్రామంలో, నట్టడవిలో ఉద్యాన లతలాగా ఉంటున్నది. చనిపోయిన వినోదిని భర్త రాజలక్ష్మికి వరసకు మేనల్లుడు. ఆ బాంధవ్యం పురస్కరించుకుని వినోదిని రాజలక్ష్మిని చూడవచ్చి, ఆమెకు సకలోపచారాలూ చెయ్యసాగింది. ఆమె తన కోడలై వుంటే ఎంతబాగుండేదోగదా అనుకున్నది రాజలక్ష్మి.

"అమ్మ''ను ఆ గ్రామంలో ఒంటిగా విడిచిపోవటానికి మనసొప్పక బిహారీ అక్కడే వుండిపోయి, ఊరంతా తిరిగి, అందరినీ కలుసుకుని, క్షణంలో అందరికీ నాయకుడైపోయాడు. అతని కా వూరువాళ్ళు బ్రహ్మరథం పట్టేశారు.

తన గదిని ఎవరో శుభ్రంగా ఉంచుతూ, అక్కడ పూలు అమర్చుతున్నట్టు బిహారీ గమనించి, రాజలక్ష్మిని అడిగాడు. ఆమె పుస్తకాలు చూసి, ఆమె పేరు వినోదిని అని తెలుసుకున్నాడు.

"ఈ పిల్లనే మీ రిద్దరూ పెళ్ళాడారుకారు,'' అన్నది రాజలక్ష్మి.

"మోసపోయాం, అయినా పెళ్ళాడి మోసపోవటం కన్న, పెళ్ళాడక మోసపోవటం నయం," అన్నాడు బిహారి.

రాజలక్ష్మి కొడుకు పిలుపుకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నది. పుట్టినాక మహేంద్రు డెన్నడూ ఇంతకాలం తల్లికి దూరంగా వుండలేదు. చివరకు మహేంద్రుడినుంచి బిహారీకి ఉత్తరం వచ్చింది. అందులో మహేంద్రుడు రాసిన వాక్యం "చాలా కాలానికి పుట్టింటికి వెళ్ళి అమ్మ చాలా సుఖంగా వున్నదనుకుంటాను," మాత్రమే చదివివినిపించి, బిహారీ ఆ ఉత్తరాన్ని ఒకమూలకు గిరవాటు వేశాడు.

ఉత్తరంలో ఇంకా తననుగురించి కొడుకు చానా విషయాలు రాసివుంటాడన్న ఆశతో రాజలక్ష్మి ఆ ఉత్తరాన్ని తీసుకుపోయి వినోదిని కిచ్చి చదవమన్నది, వినోదిని చదవసాగింది. తల్లినిగురించి రాసిన వాక్యం తరువాత మహేంద్రుడు తమ దాంపత్య జీవితరహస్యాలు బిహారీకి రాశాడు. వినోదిని కొంచెం చదివి, "ఇదేమి వింటావు పోనిస్తూ!'' అన్నది. తరవాత ఆమె ఒంటరిగా ఆ ఉత్తరం చదువుకుని చాలా ఉద్రేకం చెందింది. మహేంద్రుడూ, ఆశా ఎటువంటివాళ్లో, వాళ్ళ దాంపత్యం ఎటువంటిదో ఊహించుకుంటూ, అవే ఆలోచనలతో ఆమె తనబుర్ర వేడెక్కించుకున్నది

# 3

రాజలక్ష్మి వెళ్ళిన కొద్దిరోజులకే అన్నపూర్ణ బయలుదేరింది. ఆమె తనవంతు వచ్చే ఆస్తి మహేంద్రుడిపేర రాసి, దస్తావేజు తీసుకుని బారాశతకు వెళ్ళి, దాన్ని

రాజలక్ష్మి కిచ్చి, తాను ఇక కాశీలో ఉంటాననీ, తనకు నెలకు పదిహేను రూపాయలు పంపమనీ అన్నది. ఆమె తనచేతి బంగారుగాజులు తీసి బిహారీ కిచ్చి, "వీటివి నీ కాబోయేభార్య కియ్యి, మహేంద్రుణ్ణి, ఆశనూ కాస్త కనిపెట్టుకునిఉండు," అని చెప్పి వెళ్ళిపోయింది.

ఇద్దరు పెద్దవాళ్ళూ వెళ్ళాక ఇల్లు ఎంగిలి మంగలంలాగా తయారయింది. ఇంటి కేం తేవాలో మహేంద్రుడికి తెలీదు తెచ్చినవి ఏం చెయ్యాలో ఆశకు తెలీదు వేళ్ళు తెగిపోయాక వాళ్ళ ప్రేమవృక్షం వాడిపోవటం స్పష్టంగా కనిపించింది. నౌకర్లు తప్పించుకు తిరగసాగారు తిండిపెట్టేవాళ్ళు లేక వాళ్ళ పెంపుడుకోయిల పంజరంలోనే చచ్చిపోయింది

"మీరు వెంటనే వెళ్ళి అమ్మను తీసుకురండి," అన్నది ఆశ భర్తతో.

సరిగా అదేసమయానికి బిహారీ ప్రత్యక్షమయాడు. అతను వారాశతనుంచి వచ్చి, "ఇల్లు మహాకళగా ఉంది ఇప్పటికైనా అమ్మను తీసుకరాగూడదా?" అన్నాడు.

"మేం ఆమెకోసమే ఎదురుచూస్తున్నాం," అన్నాడు మహేంద్రుడు

"ఆమాట ఒక ఉత్తరంముక్క రాయటాని కెంత సేపు పడుతుంది నిన్ను వెనక నీతల్లి పాడుచేసింది, ఇప్పుడు నీ భార్య పాడుచేసేప్రయత్నంలో ఉంది," అని బిహారి మహేంద్రుడిచేత ఉత్తరం రాయించి, తీసుకుని వారాశత వెళ్ళాడు రాజలక్ష్మి వినోదినిని వెంటబెట్టుకుని బిహారితో తిరిగి కలకత్తా చేరుకున్నది.


ఇప్పుడు ఆశ పూర్తిగా మారిపోయింది. ఆమె అస్తమానం అత్తగారి వెంటనే ఉండి, చెప్పని పనులుకూడా చేస్తున్నది. భర్త పిలిచినా, అత్త తరిమితేగాని వెళ్ళటం లేదు

వినోదిని చాలా చురుకైన మనిషి ధైర్యంతో కూడిన ఆమె చూపులూ, తొణికిసలాడే యౌవనమూ, పనులు చెయ్యటంలోనూ, నౌకర్లకు పనులు పురమాయించటంలోనూ ఆమె దక్షతా, అధికారమూ చూసి ఆశ తనకు తానే అల్పురాలుగా భావించుకున్నది రాజలక్ష్మికూడా వినోదినిని తెగమెచ్చుకునేది అలాటి వినోదిని స్నేహంగా దగ్గిరికి వచ్చేటప్పటికి ఆశ పట్టరాని ఆనందం పొందింది.

"నీ కేదైనా మారుపేరు పెడతాను; ఏం పేరు పెట్టమన్నావు?" అని ఆశ అడిగింది

"చేఖేర్‌బాలీ (కంటి నలుసు)," అన్నది వినోదిని నవ్వుతూ ఆశ ఆమెను కావిలించుకుని "చేఖేర్‌బాలీ!" అని మళ్ళీమళ్ళీ పిలుస్తూ, విరగబడి నవ్వింది

ఆశను చూస్తుంటే వినోదినికి ఈ ఇల్లూ, ఈ భర్తా, ఈ దాంపత్య ప్రేమా



తనపై ఉండవలసినవేగదా అనిపించి చాలా బాధ కలిగేది. ఆమె ఆశచేత ఆమె పడకటింటి కబుర్లన్నీ చెప్పించుకుని వింటూ, నిలువునా దహించుకుపోయేది. సాయంకాలంపూట ఆశను చక్కగా ముస్తాబు చేసి భర్తదగ్గిరికి పంపేది. పగలు ఆశచేత అడ్డమైన పనులూ చేయించి, మహేంద్రుడు ఇంట్లోనే ఉన్నాకూడా భర్త దగ్గిరికి వెళ్ళనిచ్చేదికాదు

"ఆయన కోప్పడతారు నేను వెళతాను," అనేది ఆశ.

"కోప్పడనీ, పానకంలో ఆపాటి మిరియపుఘాటు లేకపోతే రుచి ఉండదు," అనేది వినోదిని.

వినోదినికి మిరియపుఘాటే తెలుసుగాని, పానకం రుచి ఎలా ఉంటుదో తెలీదు. అందుకని ఆమె ఆశచేత వాళ్ళ దాంపత్య రహస్యాలు చెప్పించుకు వినేది.

మహేంద్రుడు మటుకు, "ఈ పానకంలోపుడక ఎక్కడ దాపరించింది; ఎప్పుడు పోతుంది?" అని భార్య నడిగేవాడు. అతను తల్లితో ఏవరో పడుచు వితంతువును తెచ్చిపెట్టుకోవడం నా కేమీ బాగాలేదు," అన్నాడు.

"అది మా విపినుడి భార్య పరాయి దెందుకయింది? దాని మూలానే ఈ ముసలితనంలో నాకు శాస్త విశ్రాంతి చిక్కుతున్నది అయినవా ళ్లెవరూ నా కిలా సేవ చెయ్యనే లేదు," అన్నది రాజలక్ష్మి. ఆమె బిహారిచేతకూడా తన కొడుక్కు చెప్పించింది

మహేంద్రు డింతవరకు వినోదనిని చూడలేదు గాని, బిహారి చూశాడు. ఆమె దీపశిఖలాటిదనీ, ఇంటిని వెలిగించటానికీ, ఇల్లు తగలబెట్టటానికీ కూడా ఆమెకు శక్తి ఉన్నదనీ, అలాటి మనిషితో ఆడుకోవటం గాని, ఆమెను ఉపేక్షించటానికి గాని లేదనీ అతని నమ్మకం. ఆమెను బారాశతకు తిప్పిపంపటం వనవాస శిక్ష విధించటమే ననికూడా అతను భావించాడు

విశృంఖల ప్రణయం త్వరలోనే మాసిపోయింది. మహేంద్రుడూ, ఆశా పూర్వం ఉన్నంత నిజమైన అన్యోన్యంతోలేరు. ఇద్దరిలోనూ పరస్పర విముఖత కొంచెంగా తల ఎత్తింది దాన్ని వాళ్ళు కపటనటన చాటున దాస్తున్నారు అందులో అపస్వరాలు వినిపిస్తూనే ఉన్నాయి మహేంద్రుడు తన దృష్టిని పక్కకు మళ్ళించి చదువులో కొంతవరకు నిమగ్ను డయాడు ఆశకు వినోదిని తప్ప మరో ఆధారం లేదు. వినోదినిని రాజలక్ష్మి ఆశతో అంటగా పూసుకు తిరగవద్దని హెచ్చరించింది. ఆకారణంచేత, ఆశ తన మనస్సులో మాటలు చెప్పుకోవాలంటే వినోదిని సందివ్వటం లేదు

ఎలాగైనా వినోదినికీ తన భర్తకూ పరిచయం కలపాలని ఆశకు గట్టి తీర్మానం కలిగింది తన భర్త ఎదటకి రమ్మని ఆమె వినోదినిని పీడించసాగింది ఆమె తన భర్తను-కూడా అలాగే వేధించింది

నిజానికు వినోదినీ, మహేంద్రుడూ కూడా ఒకరి నొకరు చూడాలని లోపల తహతహ లాడుతూనేఉన్నారు కాని పైకి ఇద్దరూ తమ కది ఏ మాత్రము ఇష్టం లేనట్టు నటించారు చివరకు మహేంద్రుడు అతి కష్టంమీద వినోదినిని చూసి మాట్లాడటానికి ఒప్పుకున్నాడు మర్నాడు తెల్లవారగట్టనే ఆశ వినోదినిని లేపి, తన భర్తతో మాట్లాడటానికి రమ్మన్నది వినోదిని నిరాకరించింది ఆశ చిక్కులో పడింది. ఆమె వాళ్ళిద్దరినీ పరిచయం చెయ్యటానికి దొంగఎత్తు వేసింది ఊలు అల్లిక నేర్చుకునే నెపంమీద ఆమె వినోదినిని తన పడకగదికి తెచ్చి, వాళ్ళిద్దరూ అక్కడ ఉన్న సమయంలో తన భర్తను రప్పించింది. మహేంద్రుడు రాగానే వినోదిని వెళ్ళిపోబోయింది గాని, ఆశ ఆమెను బలవంతంగా కూర్చో పెట్టింది.



అటుతరవాత వినోదిని తన దారికి రోజూ అడ్డుతగిలి, పలకరిస్తుందని మహేంద్రు డాశించాడు. కాని అలా జరగలేదు. వినోదిని అతనికి మళ్ళీ కనిపించ లేదు ఆమె తనను గురించి ఏమీ అనసుకూడా లేదని ఆశ అన్నమీదట అతనికి మరింత ఆరాటం హెచ్చింది అత నొక కెమెరా కొని, ఇంటిపనివాళ్ళకు ఫోటోలు తియ్యసాగాడు. వినోదినికి ఒక ఫోటో తియ్యమని ఆశ అడిగింది. మహేంద్రుడు సరేనన్నాడు. వినోదినిని అడిగితే వద్దన్నది.

ఆమీదట ఆశ ఒక యుక్తి పన్నింది. ఆమె ఒకనాటి మధ్యాన్నం వినోదినిని తన గదికి తెచ్చి నిద్ర పుచ్చింది. ఏనాడూ పగటివేళ నిద్రపోని వినోదిని ఆ గది లోకి వస్తూనే నిద్ర ముంచుకొచ్చి, చక్కని భంగిమలో పడుకుని నిద్రపోయింది. మహేంద్రుడు కెమెరాతో వచ్చి, ఆమె చుట్టూ తిరిగి ఎటునుంచి ఫోటో తీస్తే బాగుంటుందో చూశాడు, తీరా ఫోటో తియ్యబోయేక్షణంలో వినోదిని లేచి కూర్చుని, "ఇదే మన్యాయం?" అన్నది.

కాని చివర కామె అతన్ని తన ఫోటో, తననూ ఆశనూ కలిపి ఇంకో ఫోటో తీయనిచ్చింది. అన్ని ఫోటోలూ బాగారాలేదు. తీసిన ఫోటోలే మళ్ళీ తీయవలసి వచ్చింది ఈలోపుగా పరిచయమూ, సంభాషణా అల్లుకుపోయాయి

ఒక విదంగా అశకు వినోదిని గొప్ప అండ అయింది. ఆశకు చమత్కార సంభాషణ చాతకాదు ఆ లోపం వినోదిని తీర్చింది. మహేంద్రుడు తన భార్యను

హాస్యాలాడి వెటకారం చేస్తే, ఆమె తరఫున వినోదిని ఎదురుజవాబు చెబుతుంది నిజమైన సరసాలు మహేంద్రుడికీ వినోదినికీ మధ్య జరుగుతూంటే ఆశ వాటిలో భాగం పంచుకుంటున్నది.

వినోదిని ఆశ చెయ్యలేని పనులన్నీ మహేంద్రుడికి చేసిపెట్టుతున్నది. అతనికి వేళకు భోజనమూ, అతని వస్తువులు సర్ది అందుబాటులో ఉంచడమూ, అతను కాలేజీ ఎగగొట్టకుండా చూడటమూ మొదలైన పనులన్నీ వినోదిని ఎంతో సమర్థతతో చేస్తున్నది. ఇందుకోసం ఆమె ఇంటిపని మానుకోలేదు, రాజలక్ష్మి సేవ కూడా మానలేదు వినోదిని అల్లిన నెక్‌టై వేసుకుని మహేంద్రుడు దేదో సుఖం అనుభవిస్తాడు. వినోదిని తనవద్దకు అలంకరించి పంపిన భార్యనుంచి పొందే ఆనందంలో ఇంకోమనిషికూడా ఇమిడిఉన్నట్టు భావిస్తాడు.

బిహారీ ఒక ఆదివారం భోజనానికి వస్తానని కబురు చేస్తే, మహేంద్రుడు తాను బయటికి పనిమీద వెళుతున్నట్టు జవాబు రాశాడు. బిహారీ ఇంటిదగ్గిరే భోజనం చేసి వచ్చేసరికి దొంగ దొరికాడు. అతను తలనొప్పిగా ఉన్నట్టు అభినయించాడు ఆ అభినయాన్ని సమర్థించుతూ వినోదిని అతనికి 'ఉడుకులాం' పట్టీ వేసింది, విసిరింది, నానాసేవలూ చేసింది.

ఇదంతా కపటనాటక మని గ్రహించినట్టుగా బిహారీ నవ్వి, "వినోద వదినా, ఇలాటి ఉపచారాలతో రోగం జాస్తి అవుతుందిగాని, తగ్గదు మీరు చేసే సేవ చూస్తే నాక్కూడా తలనొప్పి వస్తున్నది. కాని మావంటి అభాగ్యుల తలనొప్పి దానంతట అదే తగ్గిపోతుంది," అన్నాడు.

వ్యవహారం ఇంతదూరం వచ్చిందని బిహారీ ఎరగడు అతను పనిపెట్టుకుని ఆ వ్యూహంలో ప్రవేశించాడు. "వినోదవదినా, ఈ అబ్బాయిని వీడితల్లి పాడు చేసింది, స్నేహితుడు పాడుచేశాడు, భార్య పాడుచేస్తున్నది. నువుకూడా వాళ్ళతో చేరతావా?" అన్నా డతను.

"పాడైపోవటానికి సిద్ధంకావటం తేలికనుకున్నావుటోయ్ బిహారీ? కావలిస్తే నువు కూడా దరఖాస్తు పెట్టుకుచూడు, అది మంజూరుకాదు," అన్నాడు మహేంద్రుడు.

"పాడైపోవటానికైనా సమర్థత ఉండాలి బిహారిబాబూ," అన్నది వినోదిని నవ్వుతూ.

"స్వతహాగా లేకపోతే ఇతరుల నేర్పువల్ల సమర్థత కలగొచ్చు. కాస్త అవకాశం ఇచ్చి చూడరాదా?" అన్నాడు బిహారి.

వినోదిని ఆశతో, "మీ మరిదిభారం నువు తీసుకుంటావా ఏమిటి? అతను

నన్ను అడ్డంపెట్టుకుని నిన్నే ప్రేమభిక్ష అడుగుతున్నాడు," అన్నది.

ఆశకు అసహ్యంవేసింది. బిహారీకి మొహం కందింది. ఆశను వేళాకోళం పట్టించటం అతను భరించలేడు తనను అంతతేలిక చేసేవాడు ఆశపట్ల శ్రద్ధగా ఉండటం వినోదినికూడా భరించలేకపోయింది. అతను రసాభాసు చెయ్యటానికి పూనుకున్నాడని ఆమె గ్రహించింది.

ఆశ వెళ్ళిపోయింది "నిరాశ చేసుకుని వెళ్ళిపోవద్దు, బిహారీబాబూ! నేను వెళ్ళి ఆశను పంపిస్తాను," అని ఒకవిసురు విసిరి వినోదినిక్కూడా వెళ్ళిపోయింది.

బిహారి ఉద్రేకంతో మహేంద్రుడితో, "నువు కావలిస్తే నాశనమైపో కాని నిన్నే నమ్ముకున్న ఆ ఇల్లాలిని నాశనం చెయ్యకు," అన్నాడు.

"చెప్పేది సూటిగా చెప్పు," అన్నాడు మహేంద్రుడు.

"వినోదిని నిన్ను పనిపెట్టుకుని గోతిలోకి లాగుతున్నది ను వ్వందులో పడుతున్నావు."

"పరువుగల ఆడదాన్ని సందేహించదలిస్తే నువ్వీ యింటికి రావటం మంచిది కాదు."

అంతలో వినోదిని ఒక పళ్ళెంలో మిఠాయి తెచ్చి బిహారి ముందు పెట్టి, "నోరు కొంచెం తీపి చేసుకుని మరీ వెళ్ళండి," అన్నది.

"నా దరఖాస్తు మంజూ రయినట్టేఉందే," అన్నాడు బిహారి నవ్వుతూ.

"మరిదిగా దబాయించి తీసుకునేదానికి దరఖాస్తెందుకు?" అన్నది వినోదిని.

ఆ రాత్రి ఆశ తన భర్తతో బిహారిమీద తనకుగల అసహ్యం గురించి చెప్పింది. మర్నాడు ఉదయమే మహేంద్రుడు బిహారివద్దకు వెళ్ళి, "నిన్ను చూడటం వినోదిని కిష్టం లేదులావుంది. ఆమె మన యింటిపిల్లకాదు చూడూ!" అన్నాడు.

ఆ మధ్యాన్నం బిహారీ వచ్చి వినోదినికి క్షమాపణ చెప్పుకున్నాడు; "నా మొహం చూడటం మీకు కష్టంగా వుందని మహేంద్రు డన్నాడు. నన్ను క్షమించండి, వెళ్ళిపోతాను."

"నేను ఇవాళ ఉంటాను, రేపు పోతాను. నా కోసం మీరు వెళ్ళిపోవటమేమిటి? ఇంత గందరగోళం అవుతుం దని తెలిస్తే నేను రాకనేపోదును," అంటూ కంట తడిపెట్టుకుని వినోదిని గబగబా వెళ్ళిపోయింది.

ఆమె రాజలక్ష్మితో వెళ్ళిపోతానని చెప్పింది. ఈ సంగతి విని మహేంద్రుడూ, ఆశా వినోదినిమీద అలిగి కూర్చున్నారు. చర్చ జరిగింది. కాని ఆరోజుకేమీ తేల

లేదు మర్నాడు బిహారీ వచ్చి, "మీరు వెళ్ళిపోతే నా కారణంగానే వెళ్ళిపోయా రనుకోవలసివస్తుంది,'' అన్నాడు.

''మీ రందరూ చేరి నన్ను వుండమని నిర్బంధించటం అన్యాయం" అన్నది వినోదిని.

"లక్ష్మీదేవిలాటి మిమ్మల్ని ఎవరయినా కోరి వదిలిపెట్టుకుంటారా ?" అన్నాడు బిహారి.

వినోదిని వెళ్ళిపోయే ప్రసక్తి మానేసింది.

# 4

అదివారంనాడు డమ్‌డమ్ పార్కుకి పిక్నిక్ వెళ్ళడానికి మహేంద్రుడు ఏర్పాటుచేశాడు అతనూ, అతనిభార్యా, బిహారీ, వినోదినీ ఒకబండిలోనూ, సామానూ సరంజామా ఇంకోబండిలోనూ తరలాయి బిహారీ పెద్దపాకేజి ఒకటి తెచ్చాడు. సామాన్లబండి దారిలో ఇరుసు విరిగి పార్కు చేరటం ఆలస్యమయింది. పార్కుచేరుతూనే బిహారీ తన పాకేజీలోనుంచి కిరసనాయిలు స్టవ్ తీసి, నీరు కాచి, అందరికీ టీ చేసియిచ్చాడు. వంటవేళ అయింది సామాన్లబండి జాడలేదు బిహారీ పాకేజీలోనుంచి బియ్యమూ, కూరలూ, పచ్చళ్ళూ, మసాలాలూ పైకి వచ్చాయి. వినోదినీ బిహారీ కలిసి వంట చేశారు.

భోజనం చేస్తూనే మహేంద్రుడు చెట్టునీడన పడుకుని నిద్రపోయాడు ఆశ బంగళా గదికి వెళ్ళి తలుపులు మూసి విశ్రాంతి తీసుకున్నది. బిహారీ, వినోదినీ కాలక్షేపానికి మిగిలారు. అప్పుడు వినోదిని బిహారీకి తన చిన్ననాటివిషయా లన్నీ చెప్పింది. అయిదుగంటలకు మహేంద్రుడు నిద్ర లేచాడు. చీకటిపడి వాళ్లు నలుగురూ ఇంటికి బయలుదేరారు.

పిక్నిక్ జరిగిన కొద్దిరోజులకు రాజలక్ష్మికి ఇన్‌ఫ్లూయెంజా తగిలింది, వినోదిని ఆమె పరిచర్యలలో మునిగితేలుతూ మహేంద్రుణ్ణి. ఆశనూ బొత్తిగా చూడటం మానేసింది. మహేంద్రుడు అస్తమానమూ జబ్బుగదిదగ్గరే తారట్లాడ సాగాడు. అతను తనకోసం కారాడటం వినోదినికి సంతోషం కలిగించినా, అలాటి చోటూ, సమయమూ అతను పాటించకపోవటం ఆమెకు జుగుప్స కలిగించింది

''మహేంద్రబాబూ, మీ రిక్కడ కూర్చుని ఏం పనిసహాయం చేస్తున్నారు ? వెళ్ళండి, నిష్కారణంగా కాలేజి మానకండి,'' అన్న దామె.

ఈ మందలింపుతో మహేంద్రుడు దెబ్బతిన్నాడు. మధ్య వినోదిని లేకపోయే సరికి అతను తన భార్యతో సరదాగా మాట్లాడలేకుండాఉన్నాడు ఆమెతో అసలు

మాట్లాడకపోవటమూ బాధగానేఉన్నది. ఆశకు ఏపనీ చేతకాదు, నేర్చుకునేశక్తిగాని, ఆసక్తిగానిలేదు అందుచేత అతను భార్యమీద చిరాకు పడుతున్నాడు. ఆమె తన మనస్సు నాకట్టుకునే ప్రయత్నం ఏమీ చెయ్యకపోవటం అతనికి అర్థంకాలేదు. అతనికి ఇంట్లో ఉండబుద్ధిపుట్టక, కాలేజీకి దగ్గిరగా ఒకభాగం అద్దెకు తీసుకుని అక్కడికి వెళ్ళిపోవాలని నిశ్చయించాడు. రాత్రి పని జాస్తిగా ఉంటున్నదని భార్యతో చెప్పాడు తనమీది కోపంతో అతను వెళ్ళిపోతున్నాడని ఆశ బాధపడింది. అలాటి దేమీ లేదనీ, తన హృదయంలో ఆశదే అగ్రస్థానమనీ చెప్పి, అతను పెట్టె సర్దుకుని, కోలుకుంటున్న తల్లికి చెప్పి, వినోదినితో చెప్పకుండా ఒక ఉదయం తన కొత్తయింటికి వెళ్లాడు.

తనమీద లక్ష్యంలేనట్టు కనిపించటానికే మహేంద్రుడు ఇల్లు విడిచివెళ్ళాడని వినోదిని అనుకున్నది. అతన్ని వేధించే అవకాశం పోయేసరికి ఆమె కేమీ తోచటంలేదు. ఆశకూడా ఇప్పుడు పనికిమాలిన వస్తువయిపోయింది. ఆమె అమాయకురాలైన ఆశచేత మహేంద్రుడికి ఉత్తరాలు రాయించింది. దస్తూరీ చూసి అతను ఆ ఉత్తరాలు ఆశవే ననుకున్నాడు గాని, అందులోని భాషా, భావాలూ ఆశవి కావు, విరహిణి అయిన వినోదినివి.

మూడో ఉత్తరం చూశాక మహేంద్రుడు నిలవలేక ఇంటికి వచ్చేశాడు అతను ఊహించినట్టు వినోదిని అతనికంట పడలేదు. ఆ ఉత్తరాలు రాయించటంలో ఆమె ఉద్దేశం అతనికి అర్థంకాలేదు. రాజలక్ష్మి అతనిదగ్గిరికి వచ్చి, "విపినుడిభార్య వెళ్ళిపోతానని పట్టుబట్టి కూర్చున్నది," అని లబలబ లాడింది

మహేంద్రుడు వినోదినివద్దకు వెళాడు.

"కాలేజీనుంచి హఠాత్తుగా వచ్చారే ?" అన్న దామె.

"చచ్చిన శవాలను చూస్తూ ఎన్నా ళ్ళుండను,'' అన్నా డతను.

"బతికున్నవాటితో పనివచ్చింది కాబోలు !''

మహేంద్రు డామె దగ్గిరగా వచ్చి కూర్చుని, "నే నేం తప్పు చేశాను? ఎందుకు వెళ్ళిపోతున్నావు ?" అని అడిగాడు.

వినోదిని కొంచెం ఎడంగా జరిగి, "నేను ఉన్నా, మానినా మీకు ఒరిగేదీ, తరిగేదీ ఏముంటుంది ?" అన్నది.

మహేంద్రు డామె చెయ్యి పట్టుకుని, "ఏమైనా ఉంటే ఉండిపోతారా?" అన్నాడు. వినోదిని చప్పున చెయ్యి విడిపించుకుని దూరంగా జరిగి కూర్చున్నది. అతని ఉద్రేకం దిగిపోయింది. ఇంతలో ఆశ రావటం గమనించి వినోదిని, ఏదో ప్రశ్నకు

సమాధానం చెబుతున్నట్టు, "సరే, మీ రన్నట్టే కానివ్వండి. మీరు పొమ్మనేదాకా ఉంటాను," అన్నది. ఆశ ఆనందంతో ఆమెను కావిలించుకున్నది.

తాను చేసిన పొరపాటుకు కుమిలిపోతూ మహేంద్రుడు గదినుంచి వెళ్ళిపోయాడు.

బిహారీ అక్కడికి వచ్చి ఆశ ముఖాన ఆనందరేఖలు చూసి, వినోదినితో, "పెద్దవదినా, నీకూ ఎవరూలేరు. నువు ఇక్కడే ఉండి, ఆశను కనిపెట్టి ఉండి తీరాలి," అన్నాడు.

ఆ రాత్రి మహేంద్రుడు ఆశతో. ''చునీ, పిన్నిని చూడటానికి కాశీ పోతాను. ఆమెను చూసి చాలాకాలమయింది. ఆమెను చూడాలని తహతహగా ఉంది,'' అన్నాడు.

అతను మర్నాడు వినోదినితో చెప్పకుండానే కాశీకి బయలుదేరాడు.

# 5

మహేంద్రుడు కాశీలో అన్నపూర్ణను చూసి, కాలేజీ తెరిచేదాకా అక్కడే గడిపి, తన మనసులోనుంచి అంతస్సంఘర్షణనూ, వినోదినినీ పూర్తిగా తొలగించేసుకుని, అక్కడ ఆశను ప్రతిష్ఠించుకుని ఇంటికి తిరిగి వచ్చేసరికి, ఆశ తాను కాశీ వెళ్ళి పిన్నిని ఒక సారి చూస్తాననీ, తన పెత్తండ్రి భార్య కాశీకి పోతున్నదనీ, ఆమె వెంట వెళతాననీ అన్నది.

ఇది విని బిహారీ, భార్యాభర్తలకు బాగా చెడిపోయిఉంటుం దనుకున్నాడు. కాక పోతే, ఆశ తన భర్తవెంట కాశీకి వెళ్ళక, అత నక్కడినుంచి తిరిగిరాగానే ఎందుకు ప్రయాణ మవుతున్నదీ ? ఆశ మనస్సు క్షోభపడుతున్నదనీ, వినోదిని వెంట ఉంటే మంచిదనీ తోచి అతను మహేంద్రుడితో, "ఆశ వెంట వినోద వదినెకూడా వెళ్ళితే ?" అన్నాడు.

ఈ మాటకు మహేంద్రుడు మండిపడ్డాడు. "అనే దేదో సూటిగా అనరాదా ? నేను వినోదినిని ప్రేమిస్తున్నా ననుకుని, నన్ను ఆమెనుంచి రక్షించటానికి ఈమాట అంటున్నావు. అసలు నువు ఆశను ప్రేమిస్తున్నావు," అని అతను ఆవేశంతో అరిచాడు.

బిహారీ కుర్చీలోనుంచి లేచి మహేంద్రుడిపైన పడబోయినంత పనిచేసి, నిగ్రహించుకుని, "దేవుడు నిన్ను క్షమిస్తాడుగాక," అని గబాగబా బయటికి వెళ్ళి పోయాడు. ఆశకు ఈ మాటలు వినగానే చచ్చిన ప్రాణమయింది. పక్క గదిలో నుంచి వినోదిని పరిగెత్తుకుంటూ వచ్చి బిహారీని ఆప యత్నించిందిగాని, అతను ఆగకుండా వెళ్ళిపోయాడు.



'నువు ఆశను ప్రేమిస్తున్నావు.' అని మహేంద్రుడు చేసిన ఆరోపణ బిహారీకి ఆ క్షణంలో పరమ అన్యాయంగా తోచింది, కాని అందులో ఉన్న నలుసంతసత్యం మొలకెత్తి మొక్కగా పెరిగేసరికి, తాను తనకే తెలియకుండా ఆశను మొదట చూసిననాటినుంచీ ప్రేమిస్తున్నట్టు గ్రహించాడు. అతను రెండుమూడురోజు లాగి, ఆశ కాశీకి వెళ్ళిపోయి ఉంటుందని నిశ్చయించుకుని, మహేంద్రుడికి క్షమాపణ చెప్పకుందామని ఒకరాత్రి చీకట్లోపడి వెళ్ళాడు. ఆశ కాశీ వెళ్ళలేదని వాకిట్లోనే తెలిసింది. బిహారీ వచ్చినదారినే తిరిగి వెళ్ళిపోయి, ఆరాత్రే పడమటికి ప్రయాణం కట్టేశాడు.

మహేంద్రుడు పేల్చిన బాంబుతో ఆశ హతాశురాలై పోయింది. ఆమెను ఊరడించటం మహేంద్రుడికి సాధ్యపడలేదు. ఇక వినోదిని, మహేంద్రుడిచేత మాట పడి వెళ్ళిపోయేనాటి బిహారీ ముఖాన్ని ఎన్ని రోజులకూ మరవలేకపోయింది, చివరకామె బిహారీకి ఒక ఉత్తరం రాసింది. "పరిదీ, ఆరోజు శుష్కించిపోయిన మీ ముఖం ఎప్పటిలాగా కావాలనీ, మీ నవ్వుముఖమూ, ఉదారమైన మీ మాటలూ ఎప్పుడు కళ్ళా, చెవులా పడతాయాఅనీ ఎదురు చూస్తున్నాను—మీ వినోదవదిన."

నౌకరుచేత పంపిన ఈ ఉత్తరం వచ్చేసరికి బిహారీ పడమట కెళ్ళాడు నౌకరు దాన్ని తిరిగి వినోదినికే ఇద్దామని తెస్తూండగా మహేంద్రుడు దాన్ని తీసుకుని, తీసి చదివాడు. తాను ప్రేమించటం లేదనుకుని వినోదిని తన మనస్సును బిహారీకేసి

మళ్ళిస్తున్నదని మహేంద్రుడికి తోచింది. వినోదిని తనను తప్ప మరెవరిని ప్రేమిం చినా సర్వనాశన మవుతుందని అత ననుకున్నాడు.

అతను ఆశను కాశీకి వెళ్ళమని తిరిగి ప్రోత్సహించ నారంభించాడు.

"నా కిప్పుడు వెళ్లాలనిలేదు," అన్న దామె.

"నామీద నీ కేదో అనుమానం. నన్ను కనిపెట్టిఉండటానికే వెళ్ళాలని లేదంటు న్నావు," అన్నా డతను.

అతని వైఖరి చూసి ఆశకు భయమూ, ఆశ్చర్యమూ కలిగాయి. ఏమనాలో తోచ లేదు. చివర కామె, ''నేను కాశీ వెళతాను,'' అన్నది. ఆమె వినోదినితో తనభర్తను కనిపెట్టి ఉండమని చెప్పి తాను కాశీ వెళ్ళిపోయింది.

ఆశ వెళ్ళిపోయిన క్షణంనుంచీ మహేంద్రుడు వినోదినికోసం ఇల్లంతా కారాడ సాగాడు కాని ఆమె అతనికంట పడలేదు. రాజలక్ష్మి కొడుకు పరిస్థితి గమనించి, అతని ఆరాటానికి కారణం భార్య వెళ్ళిపోవటమే ననుకుని, "ఎవరో ఒకరు తన విషయాలు కనుక్కుంటూ ఉండటం వాడికి మొదటినుంచీ అలవాటు; కాస్త కనుక్కో," అని వినోదినితో అన్నది.


వినోదిని మూడో అంతస్తుకు అతని భోజనం తీసుకుపోయినప్పుడు ఇద్దరూ నర్మంగానూ, సరసంగానూ మాట్లాడుకున్నారు. కాని అతను చెయ్యి పట్టుకోగానే వినోదిని విడిపించుకుని వెళ్ళిపోయింది ఆరాత్రి ఆమె అతనికి భోజనం తెచ్చినప్పు డతను తలుపు గడియపెట్టి ఎంతపిలిచినా తెరవలేదు; తనకు అన్నం వద్దనేశాడు. అతనికి పశ్చాత్తాపం ముంచుకొచ్చి, కాశీలోని తనభార్య కొక ప్రేమలేఖ రాశాడు.

కాశీలో అన్నపూర్ణ ఆశను చూడగానే ఆశ్చర్యపడి, ఆమే, భర్తా అన్యోన్యంగా ఉంటున్నారా, లేదా అని అనుమానపడి ప్రశ్నించింది. కాని ఆశ తాము సుఖంగా ఉంటున్నట్టు చెప్పింది. ఆమె వినోదినిని కూడా తెగ పొగడింది.

తరువాత అన్నపూర్ణ బిహారీని గురించి యోగక్షేమాలూ, అతని పెళ్ళిగురించీ ఆత్రంగా అడిగింది ఆ గొడ్రాలికి బిహారీ కొడుకులాటివాడు

కాని ఆశ, ''పిన్నీ, ఆ బిహారీ గురించి నన్నేమీ అడగకు'' అంటూ లేచి అవతలికి వెళ్ళిపోయింది. అదిచూసి అన్నపూర్ణ బిహారీ ఎలా మారిపోయాడో, ఏ చెయ్యరానిపనులు చేశాడో అని చాలా దిగులుపడింది

సాయంకాలం అన్నపూర్ణ జపంలో వుండగా బయట తలు పెవరో తట్టారు. ఆశ దీపం తీసుకుని వెళ్ళి తలుపు తెరిచేసరికి బిహారీ కనిపించి, "ఇదేమిటి వదినా! మీరు కాశీకి బయలుదేరలేదని విన్నానే?" అన్నాడు.



ఆశ లాంతరును అక్కడే జారవిడిచి, లోపలికి పరుగెత్తుకుపోయి, "పిన్నీ, నీ కాళ్ళు పట్టుకుంటాను. అతన్ని వెళ్ళిపొమ్మను," అని విలవిల్లాడింది.

ఆ మాటలు విన్న బిహారీ వెళ్ళిపోదామనుకుంటూండగా అన్నపూర్ణ వచ్చి, "బిహారీ!'' అన్నది.

"ఏమీ అనకు పిన్నీ; నేను వెళుతున్నాను," అంటూ బిహారీ ఆమెకు నమస్కారం చేసి చీకట్లోకి నిష్క్రమించాడు. ఆ రాత్రే ఆశ, తనను వెంటనే కలకత్తాకు తీసుకుపొమ్మని భర్తకు వుత్తరం రాసింది

కలకత్తాలో మహేంద్రు డింకా వినోదిని ఆకర్షణతో ఘర్షణ పడుతూనే ఉన్నాడు. ఒకనాడు అతను తన ఒంట్లో బాగా లేదంటే, ఆమె అతని తల దగ్గిర కూర్చుని తల ఒత్తసాగింది. ఇద్దరూ ఉన్మత్తస్థితిలోనే ఉన్నారు. ఆమె నిట్టూర్పులు అతనికి తగులుతున్నాయి. ఆమె ముంగురులు అతని చెక్కిళ్ళకు తగిలేటంతగా ఆమె తల వాలిపోయింది. మహేంద్రుడు ఆవేశంతో ఉక్కిరి బిక్కిరి అయి, చప్పున లేచి కాలేజికి వెళ్ళి, అక్కడకూడా కాలు నిలువక, పెందలాడే ఇంటి కొచ్చేశాడు. అతను వచ్చేసరికి తనగదిలో బోర్లా పడుకుని 'విషవృక్షం' నవల చదువుతూ ఉండిన వినోదిని, దాన్ని తన పైటలో దాచింది. మహేంద్రుడామెమీద కలియబడి దాన్ని లాగేసి, ''ఇంత కష్టపడి పైకి తీస్తే విషవృక్షం బయటపడిందే?" అన్నాడు.

"అంతకన్న నాకు దాచుకోదగిన దేముంటుందీ ?" అన్నది వినోదిని.

"ఎందుకుండదూ ? బిహారీ ఉత్తరం రాస్తే—"

వినోదినికళ్ళు జ్యోతుల్లాగా అయిపోయాయి. మన్మధుడు శోకముడిచేశాడు.

"పరిహాసాని కన్నాను, క్షమించు," అన్నాడు మహేంద్రుడు బెరుకుగా.

"అతనితో స్నేహం చేసే అర్హతకూడా లేకుండా పరిహాసం దేనికీ ? మీది వెలితి మనస్సు," అంటూ వినోదిని వెళ్ళిపోబోతుంటే, మహేంద్రుడు ఆమెకాళ్ళను వాటేసుకుని ఆపాడు. సరిగా అదేసమయంలో బిహారీ ద్వారంవద్ద ప్రత్యక్షమయ్యాడు. మహేంద్రుడు వినోదినిని వదిలేశాడు.

"రాకూడని సమయంలో వచ్చాను. ఒక్కమాట చెప్పి పోతాను. కాశీ వెళ్ళాను. అక్కడ వదినగారున్నసంగతి నాకు తెలీదు, ఆమెపట్ల అపరాధం చేశాను. ఆమెను క్షమాపణకోరే అవకాశంలేక మీకు క్షమాపణ చెప్పుకుంటున్నాను. నామనస్సులో కించిత్తుపాపం ఏదన్నా వుంటే, అందుకోసం ఆమెను కష్టపెట్టవద్దని నాప్రార్థన," అన్నాడు బిహారీ.

పుచ్చకాయల దొంగలాగా తయారయావే. నీమీద నేను ఏ ఆరోపణా చెయ్యకుండానే ఎందు కీ క్షమాపణ ?" అన్నాడు మహేంద్రుడు.

"అతనికి సమాధానం చెప్పకండి. అతనిమాటలు అతని నోటికే కళంకంగానీ, మీకు కళంకంకాదు," అన్నది వినోదిని.

బిహారీ మెట్లు దిగి వెళ్ళిపోతూంటే వినోదిని అతని వెనకే వెళ్ళి అతనికి అడ్డు తగిలి, అతని చేతిని తన రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుని, "న న్నేమైనా అనాలని ఉంటే అని మరీ వెళ్ళండి," అన్నది. బిహారీ ఆమెను ఒక్కతోపు తోసి వెళ్ళిపోయాడు.

ఆమె పడిపోయిన చప్పుడు విని మహేంద్రుడు చప్పున వచ్చి, ఆమె చేతికి దెబ్బతగిలి రక్తం కారుతుండటం చూశాడు. అతను తనలో తాను సంఘర్షణ పడటం మానేసి, ఆమెను ప్రేమభిక్ష వేడాడు. ఆమె అతని ప్రేమను నిరాకరించ లేదు, కాని అతని గదికి రమ్మంటే, "ఇవాళ కాదు," అన్నది.

మర్నాడు పగలల్లా అతను తియ్యని కలలు కన్నాడు. సాయంకాలం అయిదు గంటలకు అతని ఆహారం తీసుకుని వినోదిని అతనిగదికి వచ్చింది. వినోదిని, అతని భోజన మయాక, ఆరేసిన బట్టలు తీసి మడత పెడుతూఉండగా రాజలక్ష్మి పైకి వచ్చింది. వినోదిని బట్టలు మడతపెట్టాక ఆమె, "ఇంక చెరుకుపానకం కాచిపెడతావా, మ రేదెన్నా పని ఉందా?" అని అడిగింది.



"పదండి, మిఠాయి ఉండలు తయారు చేద్దాం," అన్నది వినోదిని.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయేటప్పుడు మహేంద్రుడు తల్లితో, చీకటి పడ్డాక తాను వినోదికి ఏదో పుస్తకం చదివి వినిపించబోతున్నట్టు చెప్పాడు. ఆ మాట జ్ఞాపకం పెట్టుకుని, కొడుకు మరీ వంటరితనంతో బాధపడుతున్నా డనుకుని రాజలక్ష్మి, వినోదిని అతనికి రాత్రిభోజనం తెచ్చేటప్పుడు తానుకూడా వెంట వచ్చింది. ఆ భోజనంతోబాటు కొత్తగా చేసిన మిఠాయికూడా ఉంది.

మహేంద్రుడు భోజనం చేశాక ముగ్గురూ అతని పడకగదిలో చేరారు. అతను ఎంతకీ పుస్తకపఠనం మాట ఎత్తలేదు. ఇంతలో రాజలక్ష్మికోసం పొరుగింటావిడ వచ్చిందని దాసీది వచ్చి చెప్పింది. రాజలక్ష్మి కిందికి వెళ్ళిన వెంటనే వినోదినికూడా వెళ్ళిపోయింది. ఆమెను ఆపటం మహేంద్రుడివల్ల కాలేదు. అతని ఆశలన్నీ అడుగంటాయి.

## 6

బిహారీ ఏటా తన జమీందారీనుంచి వచ్చే ఆవపూల తేనె ఒక కుండెడు రాజలక్ష్మికి పంపుతాడు. దాన్ని చూడగానే రాజలక్ష్మికి బిహారీ జ్ఞాపకం వచ్చాడు. అతను తన కొడుకులాటివాడు. తాను తప్ప అతనికి మరో తల్లిలేదు అత నీ మధ్య ఆమెకు కనిపించటమే లేదు తప్పు మహేంద్రుడిదే. వాడు బొత్తిగా భార్యాదాసుడై, తన బాల్యమిత్రులనుకూడా దూరం చేసుకున్నాడు.

ఆదివారంనాడు బిహారీని భోజనానికి పిలిస్తే బాగుంటుందన్నది వినోదిని రాజలక్ష్మితో రాజలక్ష్మి తరఫున తానే బిహారీకి ఉత్తరంకూడా రాసిపంపింది. ఆదివారంనాడు వంటఇంట అడావుడిగా ఉండటం చూసి మహేంద్రుడు కారణ మడిగాడు. బిహారీకోసం విందు చేస్తున్నా రని విని, ఉగ్రుడయాడు. తనకు మరొక చోట విందున్న దనీ, తాను ఇంట్లో భోజనం చెయ్యననీ అన్నాడు కాని బిహారీ వచ్చినప్పుడు తాను బయటికి పోవడంకూడా అతని కిష్టంలేదు. బిహారీ ఏం చేస్తాడు, వినోదిని ఏం చేస్తుందో చూడాలి.

చాలా రోజులకు వచ్చిన ఆహ్వానాన్ని సంతోషంగా అందుకుని బిహారీ వచ్చాడు. మహేంద్రుడు వచ్చి లాంఛనగా అతన్ని పలకరించాడు వినోదిని కంటపడి నప్పుడు బిహారీ పలకరించలేదు. వినోదినీ మహేంద్రుల దృశ్యం అతను ఇంకా మరవలేదు. అతను తనను గుర్తించలేదని వినోదిని ఎత్తిపొడిచింది.

మహేంద్రుడూ, బిహారీ భోజనం చేసేటప్పుడు వినోదిని వడ్డించింది వడ్డనలో ఆమె బిహారీకి పక్షపాతం చూపుతున్నట్టు మహేంద్రుడికి తోచింది. మహేంద్రుడికీ చాలా ఇష్టమయిన చేపముక్కను బిహారీ వద్దంటున్నా అతనికే వేసిం దామె.

భోజనా లయాక బిహారీని కాస్సేపు కూర్చుని వెళ్ళమని వినోదిని నిర్బంధించింది "ఏమి టీ అతిమర్యాద ? పనులుంటే వెళ్ళనివ్వరాదా ?'' అన్నాడు మహేంద్రుడు, అతను బయటికి వెళుతుంటే. వినోదినితో వస్తానని అయినా చెప్పకుండా బిహారీ బయలుదేరాడు.

బయటికి వచ్చాక బిహారి, "మహేన్దా, మన స్నేహం ఇంతటితో చెల్లేనా ?" అని అడిగాడు.

''స్నేహంవల్ల నీ కేమైనా లాభం ఉందేమో, నాకు అది అంత వాంఛనీయంగా తోచలేదు నా సంసారంలోకి పైవాళ్ళు జొరబడుతూ ఉండటం నా కిష్టంలేదు.'' అన్నాడు మహేంద్రుడు బిహారీ మారుమాటడకుండా వెళ్ళిపోయాడు

కాశీనుంచి ఆశ తిరిగి వచ్చింది. ఆమె ఒళ్ళు చేసిందని మహేంద్రుడు గమనించాడు. అన్నపూర్ణ క్షేమంగురించి అడిగాడు. ఆ తరవాత అతనికి భార్యతో ఏమీ మాట్లాడటానికి లేకపోయింది.

తన భర్త తనపై అలిగి ముభావంగా ఉంటున్నా డనుకున్నది ఆశ అన్నపూర్ణ ప్రోద్బలంవల్ల ఆమె కాశీలో కాస్త ఎక్కువరోజులే ఉండిపోయింది. ఆఖరు నాలుగైదు రోజులు ఆమె భర్తకు ఉత్తరం రాయనిమాటా నిజమే ఈ కారణాల వల్లనే భర్త అలిగా డనుకున్నది ఆశ. తన భర్త చిక్కిపోయి ఉండటమూ,

ముఖం పాలిపోయి ఉండటమూ, కళ్ళలో తీవ్రమైన వెలుగూ గమనించి అతనిలో ఏదో మానసిక వేదన ఉన్నట్టు గ్రహించి, తాను కాశీ వెళ్ళటం పొరపాటయిం దనుకున్నది.

కొన్నాళ్ళు భర్తకు ఎడమైన కారణంచేత ఆరాత్రి ఆశ తన భర్త పడుకున్న మంచందగ్గరికి స్వేచ్ఛగా వెళ్ళడానికి కాస్త బిడియపడింది అతను మంచం ఒక అంచున పడుకుని నిద్రపోతున్నట్టు నటించాడు. ఆశ అడుగులో అడుగు వేసు కుంటూ వెళ్ళి, అతని వెనక, అతనికి తగలకుండా మంచంమీద పడుకున్నది ఆమె ఏడుస్తూండటం మహేంద్రుడికి తెలిసింది, కాని అతని గుండెలో పేరుకున్న రాయి కరగలేదు తెల్లవారి లేచి ఒకరిముఖం ఒకరు చూసుకున్నప్పు డేమనాలా అని అతను ఆలోచించుకోసాగాడు. కాని తెల్లవారకముందే ఆశ మంచంమీదినుంచి లేచిపోయింది తన భర్తకు తన ముఖం చూపించటం అమెకు చేతకాలేదు.

ఆశకు ప్రపంచజ్ఞానం లేకపోవటంచేత ఆమెకు మహేంద్రుడి ప్రవర్తన అర్థం కాలేదు. అతను వినోదినిని ప్రేమిస్తున్నా డనికాని, తాను కాపరానికి వచ్చినప్పటి మహేంద్రుడు కాడనిగాని ఆమెకు తట్టలేదు.

మహేంద్రుడికి కూడా ఆరోజు మనస్సు కలవరంగానే ఉన్నది. అతను ఆశను గురించి ఆలోచిస్తున్నాడు. ఆశ అతనికి కావాలి, కాని వినోదిని కూడా కావాలి. ఇద్దరినీ వదలకుండా తా నెందుకు సుఖపడగూడదూ? ఈరాత్రికి ఆశతో మామూలుగా ఉందామని నిశ్చయించుకుని అత నింటికి వచ్చాడు. అతను భోజనం చేసే టప్పుడు ఆశ ఆ చాయలకు రాలేదు. ఆతను తన పడకగదికి వెళ్ళి పక్కమీద పడుకుని ఉద్రేకానికి గురి అయాడు. కాని అతనికి జ్ఞాపకం వచ్చినది ఆపక్కమీద తాను ఆశించి పొందిన సుఖంకాదు - దానిమీద ఒకనాడు పడుకుని తన కళ్ళపడిన వినోదిని.

అతను ఉండబట్టలేక రాత్రి ఒంటిగంటవేళ మెట్లు దిగి వినోదిని పడకగదికి వెళ్లాడు ఆశ వచ్చాక వినోదిని తన కంటపడలేదు. ఆమె ఇప్పుడుకూడా పక్క మీదలేదు.

తన గదిలో అడుగుల చప్పుడు విని, పక్కవరండాలోనుంచి "ఎవరది?" అని కేకపెట్టింది వినోదిని.

"నేనే, వినోదినీ!'' అంటూ మహేంద్రుడు వరండాలోకి వెళ్ళాడు. అక్కడ చాప వేసుకుని రాజలక్ష్మి, వినోదినీ పడుకునిఉన్నారు

"ఇంత పొద్దుపోయి ఇక్క డేంపని, మహేన్?" అన్నది తల్లి.



వినోదిని అతన్ని చురచురా చూసింది. మహేంద్రుడు మాటాపలుకూ లేకుండా వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఉదయమే పాపం బద్దలయింది.

చాకలివాడికి మహేంద్రుడి బట్టలు వేస్తున్న ఆశకు అతని కోటుజేబులో ఒక ఉత్తరం దొరికింది. అది వినోదిని మహేంద్రుడికి రాసిన ఉత్తరం. మహేంద్రుడు



కిందటిరాత్రి ఆమె పడకగదికి వెళ్ళిందిచాలక, తెల్లవారి దాసీచేత ఆమెకు "నన్ను ప్రేమించు"అంటూ ఉత్తరం రాశాడు దానికి సమాధానంగా వినోదిని ఈ ఉత్తరం రాసింది. "నన్ను తలఎత్తుకు తిరగనియ్యవా ? నన్నెందుకు ప్రేమించమంటావు ? నీకు ప్రేమ కరువయిందా ? ఎందుకీ దురాశ ? నాకు ప్రేమించే అర్హతా, ప్రేమించబడే అర్హతా లేక ప్రేమనాటకం ఆడి తృప్తిపడతాను. నీకు వాస్తవజీవితంలో ప్రేమ ఉండగా నాటకాలతో ఏంపని ? ఒకప్పుడు ఆశను ప్రేమించా ననుకున్నావు; ఇప్పుడు నన్ను ప్రేమించా ననుకుంటున్నావు; రెండూ అబద్ధమే. నేను కఠినురాలి నన్నావు. కాని కొంత దయ నాలో ఉన్నది నిన్ను దయదలిచి ఈసారికి విడిచిపెడుతున్నాను. దీనికి మళ్ళీ జవాబు రాస్తే నేను పారిపోవటంతప్ప గత్యంతరం ఉండదు."

ఈ ఉత్తరం చూడగానే ఆశ కుంగిపోయింది. మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. ఆమె కోటునూ, ఉత్తరాల్నీ తీసుకుని గదిలోకి వెళ్ళింది. ఉత్తరాల్ని కోటులో పెట్టి,

కోటు చాకలికి వెయ్యటం మానేద్దామనీ, లేకపోతే తా నా ఉత్తరం చూసినసంగతి భర్తకు తెలిసి బాధ పడతాడనీ అనుకుంది.

ఆశ ఉత్తరాన్ని పెట్టేసేలోగా అక్కడికి వినోదిని వచ్చింది. చాకలి, బట్టలు మార్చకుండా గుర్తులు వేద్దామని ఆమె ఉద్దేశం. ఆశ ఆమెకేసి చూడలేదు. రాత్రి మహేంద్రుడు తన పడకగదికి రావడం గురించి తెలిసి ఆశ బాధపడుతున్నది కాబో లనుకుని, వినోదిని కొన్ని పాతబట్టలను తీసుకుని అవతలికి వెళ్ళి గుర్తులు వెయ్య సాగింది.

మరి కాస్సేపటికి, కాలేజికి బయలుదేరి వెళ్ళిన మహేంద్రుడు కంగారుగా తిరిగి వచ్చి మైలబట్టలు వెతకసాగాడు. అతను దేనికోసం వెతుకుతున్నదీ గ్రహించిన ఆశ అతని కోటునూ, ఉత్తరాన్నీ కింద పడేసింది.

మహేంద్రుడు వినోదిని ఉన్నచోటికి వెళ్ళాడు. అత నామె రెండుచేతులూ గట్టిగా పట్టుకుని దగ్గిరికి లాక్కుంటూ, "నేను సమస్తమూ విడిచిపెట్టేస్తే నా వెంట వస్తావా?'' అని అడిగాడు.

"రాను, చచ్చినా రాను,'' అన్నది వినోదిని.

"ఎందుకు రావు? నన్ను సర్వనాశనం చేశావు. నిన్ను తీసుకుపోయి తీరు తాను," అంటూ అత నామెను బలవంతంగా కౌగలించుకుని తన రొమ్ముకేసి అదుముకున్నాడు.

''మహేన్, ఏమిటిది?'' అంటూ రాజలక్ష్మి అక్కడికి వచ్చింది.

మహేంద్రుడు తల్లికేసి వెర్రిచూపు చూసి, వినోదినితో, "వస్తావా, రావా'' అన్నాడు.

రాజలక్ష్మి ముఖం ఆగ్రహంతో మండిపోతున్నది. అది చూసి వినోదిని, ధైర్యంగా మహేంద్రుడి చెయ్యి పట్టుకుని, ''వస్తాను పద," అన్నది.

"ఇవాళ కాదు, రేపటినుంచీ నాకు నువుతప్ప ఎవరూ ఉండరు,'' అంటూ మహేంద్రుడు వెళ్ళిపోయాడు.

ఆరాత్రి బిహారి ఇంటికి వినోదిని వచ్చి, గభాల్న అతనున్న గదిలో ప్రవేశించింది.

"ఏమి టీ ఉపద్రవం, వదినా?" అన్నాడు బిహారీ,

"మహేంద్రుడు నన్ను ప్రేమిస్తున్నాడు; అందుకని మీ దగ్గిరికి వచ్చాను. నాకు నిలవనీడ ఇవ్వండి," అన్నది వినోదిని,

"మహేంద్రుణ్ణి తప్పుదారికి లాగిం దెవరూ?"

''నేనే. అతన్ని ప్రేమించా ననుకున్నాను, అతని కొంపకి చిచ్చుపెట్టాను."



"ప్రేమించినవాళ్ళు కొంపకి చిచ్చుపెట్టరు."

"అతను అంధుడు; నన్ను అర్థంచేసుకోలేడు. మీరూ నాపట్ల శ్రద్ధ చూపి, ప్రేమించినట్టు కనబడ్డారు, కాని ఆగిపోయారు. సిగ్గువిడిచి అడుగుతున్నాను. మధ్యలో ఎందు కాగిపోయారు? మీకు అడ్డేమున్నది? నా దురదృష్టంకొద్దీ మీ ప్రేమ ఆశమీదికి మళ్ళింది. మీరు ఆశను ప్రేమించకపోతే నావల్ల ఆమెకు ఈ సర్వనాశం అయిఉండదు. సర్వం త్యాగం చేసి రేపు మహేంద్రుడు నన్ను లేవదీసుకు పోతున్నాడు.''

"ఆలా జరగటానికి వీల్లేదు," అన్నాడు బిహారీ.

"మహేంద్రుణ్ణి ఎవ రడ్డగలరు ?"

''నువ్వు.''

''ఎవరికోసం? ఆశకోసమా? మహేంద్రుడి సంసారం కుదుటపడటానికి నేను త్యాగం చెయ్యనా? అంత మంచితనం నాలో లేదు."

"ను వ్వనేవన్నీ నాటకాల మాటలు, నవలల్లా వుండే మాటలు; అందులోకూడా చావుకబారు సాహిత్యంలోవి. నాటకరంగంమీద రాణించే నాయిక జీవితంలో రాణించదు.''

"అయితే న న్నేమి చెయ్యమంటారో చెప్పండి,'' అన్నది వినోదిని నిశ్చేష్ఠురాలై పోయి.

"ఘనకార్యం ఏమీ చెయ్యనక్కరలేదు. సద్బుద్ధిగల ఆడది చేసే పనే చెయ్యి. మీ ఊరు వెళ్ళిపో."

"ఎలా వెళ్లేది ?"

"రైల్లో. నేను మీ స్టేషనుదాకా దిగబెడతాను."

''అయితే ఈ రాత్రి ఇక్కడే ఉంటాను."

''వద్దు. నాలో నాకు అంత నమ్మకం లేదు."

''ఈమాత్రం దౌర్బల్యం సహించండి," అంటూ ఆమె అతని కాళ్ళు వాటేసుకుని పాదాలు ముద్దుపెట్టుకున్నది. తరువాత మోకాళ్ళమీద లేచి అతని మెడకు చేతులు చుట్టి, ''ఒక్క క్షణం నన్ను ప్రేమించు, ఎల్లకాలమూ అవసరంలేదు," అంటూ అతని మూతికి తన మూతిని చేర్చింది.

బిహారీ ఒక్క నిట్టూర్పు విడిచి, ఆమె చేతులు నెమ్మదిగా విడిపించుకుని, లేచి మరొక కుర్చీలో కూర్చుని, "రాత్రి ఒంటిగంటకు పాసింజరుబండి ఉన్నది," అన్నాడు.

వినోదిని కాస్సేపు నిర్ఘాంతపోయి, "ఆ బండికే వెళతాను" అన్నది.

మర్నాడు రాత్రి ఎనిమిది గంటలప్పుడు మహేంద్రుడు తన యింటికి వెళ్ళి, వినోదినికోసం ఆమె గదిలో చూశాడు. వినోదిని లేదు. ఆమె వస్తువులూ లేవు. ఆమెను పేరుపెట్టి పిలిస్తే జవాబు రాలేదు. తల్లి ఆమెను తిట్టి వెళ్ళగొట్టి ఉంటుం దనుకున్నాడు. ''పొరపాటు చేశాను; నిన్ననే ఆమెను తీసుకుపోయి ఉండవలసింది," అనుకున్నాడు.

తల్లి నడిగితే వినోదిని ఎక్కడికి వెళ్ళినదీ తనకు తెలియదన్నది. గేటుదగ్గిర

ఉండే దర్వానుకూడా ఆమాటే అన్నాడు. మహేంద్రుడు వీధులవెంట పడ్డాడు.

అతను బిహారీ ఇంటికి వచ్చేసరికి, బిహారీ వెల్లికిలా పడుకుని, తన గుండెమీద ఆశా మహీన్‌ల పెళ్ళినాటి ఫోటో పెట్టుకుని దాన్ని చూస్తున్నాడు. అప్పటికే బిహారీ వినోదినిని వాళ్ళ వూరు చేర్చి తిరిగివచ్చాడు. అతను గతాన్ని నెమరువేసుకున్నాడు మొదట తనకూ మహీన్‌కూ ప్రగాఢస్నేహం ఉండేది. దానికి అడ్డుపుల్లలాగా ఆశ వచ్చింది. అటుతరవాత శనిగ్రహంలాగా వినోదిని వచ్చిపడి, ఇటు తమ స్నేహానికీ, అటు ఆశా మహీన్‌ల దాంపత్యానికీ చిచ్చుపెట్టింది. వినోదినిని ద్వేషించా లని బిహారీ ప్రయత్నిస్తే ఆమె ఆలింగనం జ్ఞప్తికి రాసాగింది. ఆమెపట్ల తన హృదయాన్ని కఠినం చేసుకునే ప్రయత్నంలో అతను ఆశా మహీన్‌ల పెళ్ళిఫోటో తీసి దానికేసి చూస్తున్నాడు.

మహేంద్రుడు తుఫానులాగా లోపలికి రావటం చూసి బిహారీ లేచి నిలబడ్డాడు. అతని రొమ్ముమీదఉన్న ఫోటో నేలమీద తివాసీపైన పడింది.

"వినోదినిని ఎక్కడ దాచావు ?" అని మహేంద్రు డడిగాడు.

"ఆమెజాడ తెలియటంవల్ల నీ కేమీ లాభంఉండదు."

"ఆమెజాడ నీకు తెలుసా ?"

"తెలుసు."

"నాకు చెప్పవా ?"

"చెప్పను."

"చెప్పితీరాలి. ఆమె నాది."

"నే నామెను దొంగిలించి తేలేదు. తనంతట తానే వచ్చి నా ఆశ్రయం కోరింది."

మహేంద్రుడు వినోదినిని పేరుపెట్టి పిలుస్తూ గదులన్నీ తిరిగాడు. ఆమె ఎక్కడా లేదు. అతను ఆఖరుసారి బిహారీ నడిగాడు, బిహారీ వినోదిని జాడ చెప్ప నిరాకరించాడు. మహేంద్రుడు ఉన్మాదంతో, కిందపడిఉన్న తమ పెళ్ళిఫొటోను తొక్కి గాజుపెంకులు బిహారీమీద గిరవాటువేసి, వేగంగా బయటికి వెళ్ళిపోయాడు

## 7

వినోదినికి మరోప్రపంచంలో పడ్డట్టయింది. ఇల్లంతా పాడుబడి, దీనంగా ఉన్నది. అదివరకు తాను ఉండిన ఇల్లే అయినా, ఇప్పుడు దుర్భరమనిపిస్తున్నది. తిరిగి దారిద్ర్యమూ, శూన్యమూ ఆమెను ఆవరించాయి. ఊళ్లోవాళ్ళు ఆమెను తమలోనిదానిలాగా చూడలేదు, బాగా బలిసి దొరసానిలాగా తయారయిం దన్నారు. ఆమెకూ మహేంద్రుడికీ ఏదో సంబంధం ఉన్నట్టు ఆ వూరికి అదివరకే పుకారు చేరింది

ఆమె వచ్చేటప్పుడు బిహారీని వారానికొకటి రెండు ఉత్తరాలు రాస్తూ ఉండమని కోరింది. వచ్చిన మర్నాడే ముసలి పోస్టుజవాను నామె తన కేదన్నా ఉత్తరం ఉన్నదా అని అడగటం చూసి ఊళ్లోవాళ్ళు వెటకారంగా మాట్లాడుకున్నారు. రెండు రోజులపాటు ఉత్తరం రాకపోయేసరికి వినోదిని తానే బిహారీకి ఒక ఉత్తరం రాస్తూ, అతను తనకు విధించిన ప్రవాసశిక్ష మరణశిక్షలా గున్నదనీ, జైలు ఖైదీలకు కూడా ఇంత ఆహారం కావలనీ, తనకు అతను రాసే రెండు మూడు వాక్యాలే ఆహారమనీ అన్నది. ఆమె ఉత్తరాన్ని పోస్టు చెయ్యటం చూసినవాళ్ళు, "ఉత్తరాలకోసం నోరు తెరుచుకు చూస్తుంది. తలుపేసుకుని ఇంట్లో కూర్చుని ఉత్తరాలు రాస్తుంది. నాలుగురోజులు కలకత్తాలో ఉండివస్తే మాత్రం ఇలా సిగ్గు బిడియాలు వదిలెయ్యాలా" అనుకున్నారు.

ఆ మర్నాడు కూడా ఉత్తరంలేదు. వినోదిని నిలువునా దహించుకుపోతున్నది. ఏకాగ్రంగా ధ్యానించి ఎవరిని పిలుస్తే వారు ఎదట వచ్చి ప్రత్యక్ష మవుతారని ఎప్పుడో విని, వినోదిని కళ్లు మూసుకుని, చేతులు జోడించి ధ్యానిస్తూ, బిహారీని ఆహ్వానించింది. అంతలో తలుపు చప్పుడయింది. ఆమె ఆత్రంగా వెళ్ళి తలుపు తెరిచింది.

"వచ్చాను, వదినా!" అన్నాడు మహేంద్రుడు.

వినోదిని చీదరతో, "వెళ్ళు, తక్షణం వెళ్ళిపో!" అని అరిచింది. ఆ క్షణంలోనే పొరుగింటావిడ వినోదినితో ఏదో చెప్పుదామని వచ్చి, మహేంద్రుణ్ణి చూసి, నెత్తిమీద ముసుకు సర్దుకుని పారిపోయింది. మహేంద్రుడు వెళ్ళిపోయి రైలు స్టేషను వెయిటింగ్‌రూములో కూర్చున్నాడు.

ఊరి పెద్దలు దేవాలయంలో చేరి పంచాయతీ జరిపి, వినోదిని ఉత్తరం రాసి మహేంద్రుణ్ణి పిలిపించిందనీ, వాళ్ళిద్దరికీ ఉన్న సంబంధం అదివరకే తమకు తెలుసు గనక, అలాటిదాన్ని ఊళ్ళో ఉండనీయరాదనీ తేల్చారు.

ఆ రోజుకూడా బిహారీనుంచి ఉత్తరం రాకపోయేసరికి, వినోదిని తాను చేసిన పని బుద్ధితక్కువైనదని నిశ్చయించుకున్నది. ఆశ జీవితం గురించి తన కేమిటి బెంగ? మహేంద్రుడు తనకోసం అలా తపిస్తుంటే తనకు బిహారీపైన ప్రేమ ఏమిటి? ఆ ప్రేమవల్ల తన కేమి ఒరిగింది?

వినోదిని బంధువురాలొచ్చి, "దౌర్భాగ్యురాలా, నిన్ను గురించి ఊళ్లో ఏమనుకుంటున్నారో విన్నావా," అన్నది.

"వాళ్ళనుకునేది నిజమే" అన్నది వినోదిని.

"అలా అయితే ఊరు చెరపడాని కేమని వచ్చావు ? ఛీ ఛీ ! మాకు తలవంపులు తెస్తివే ! వెంటనే వెళ్ళిపో."

''వెళ్ళిపోతాను.''

మహేంద్రుడి కింకా ఆశావేశం మిగిలింది. అతను చీకటితోనే బండి చేసుకుని స్టేషనునుంచి, ఆఖరు ప్రయత్నం చేద్దామని వచ్చాడు.

"వచ్చిన అపవాదు రానేవచ్చింది. ఇక్కడినుంచి తీసుకుపోతాను. ఆ పైన నాతో ఉండాలని ఉంటే ఉండు, నన్ను వదలాలని ఉంటే వదిలిపెట్టి వెళ్ళు. నేను అడ్డగించను. నేను నిన్ను మోసం చెయ్యను. ఇది మనకు ఒకరినొకరు మోసం చేసుకునే సమయం కాదు," అన్నా డతను.

వినోదిని అతనివెంట వెళ్ళటానికి సిద్ధపడి బండి ఎక్కింది. కాని అందులో అతన్ని ఎక్కనివ్వక, స్టేషన్‌దాకా బండివెనక నడిచి రమ్మన్నది. దారిపొడుగునా బండివెనుక నడవటానికి సాహసం లేక, మహేంద్రుడు రోడ్డు వదిలి, చేలకు అడ్డంపడి స్టేషనుకు నడిచాడు.

కలకత్తా చేరాక అతను వినోదినిని పటల్‌డాంగా వీధిలో ఒక ఇంట్లో ప్రవేశ పెట్టి, రాత్రివేళ సొంత ఇంటికి చేరుకున్నాడు కొడుకు వెళ్ళినప్పటినుంచీ ఉపవాసాలు చేస్తున్న రాజలక్ష్మి అతనికి భోజనం ఏర్పాటు చేసి, కోడలిని ముస్తాబు చేసి, అతని గదికి పంపింది కాని ఆశ వచ్చేసరికి మహేంద్రుడు వెళ్ళిపోయినాడు అతనికోసం ఉంచిన భోజనం పెట్టినట్టుగానే వున్నది.

ఈలోపుగా వినోదిని బసలో ఒంటరిగా కూర్చుని తన భవిష్యత్తు గురించి ఆలోచించసాగింది. ఆమె కింకా బిహారీ పైన ఆశ పోలేదు. మహేంద్రుణ్ని నమ్ముకుని లాభంలేదు అతను తన భారాన్ని మొయ్యలేడు కావాలంటే ఆమె బిహారీ ఇంటికి వెళ్ళవచ్చు కాని తన ఉత్తరానికి అతనినుంచి జవాబు వచ్చిన దాకా అతని ఎదటపడటం ఆమె కిష్టంలేదు. మహేంద్రుడు తిరిగి వచ్చేసమయానికి ఆమె ఏదో అల్లికపని పెట్టుకుని కూర్చున్నది.

మహేంద్రుడు పుస్తకాలూ, తన వస్తువులూ తీసుకురావటం గమనించి, ''ఇవన్నీ ఇక్కడి కెందుకు తెచ్చారు ? మీ రిక్కడ ఉండటానికి వీల్లేదు,'' అన్నది.

"న న్నెందుకు దూరంగా ఉంచా లనుకుంటున్నావు ? అన్నీ త్యాగంచేసి వచ్చి నందుకు నా కిదా ఫలితం ?" అన్నా డతను.

"నాకోసం సమస్తమూ త్యాగం చెయ్యనివ్వను. అన్నమాట మరిచిపోవద్దు. ఇంటికి వెళ్ళి అక్కడే ఉండండి "

హతాశుడై మహేంద్రుడు బయటికి వెళ్ళిపోయాడు. వీధులవెంట తిరుగుతూ ఉండగా అతని కొక అనుమానం వేసింది – తనను పంపేసి వినోదిని బిహారీని రప్పించుకున్నదేమో నని. అతను బిహారీ ఇంటికి వెళ్ళి విచారిస్తే, బిహారీ నాలుగు రోజులక్రితమే పడమర వెళ్ళాడని నౌకరు చెప్పాడు

మహేంద్రుడు ఆరాత్రి బిహారీ ఇంటనే పడుకుని తెల్లవారి లేస్తూనే టీపాయ్ మీద బిహారీకి వచ్చిన ఉత్తరాన్ని తీసి, వినోదిని దస్తూరి గుర్తించి, చించి చదివాడు అది వినోదిని తన స్వగ్రామంనుంచి రాసిన ఉత్తరం. అది చేరేసరికే బిహారీ పడమర వెళ్ళిపోయాడు

మహేంద్రుడా ఉత్తరం చూసి వినోదినివద్దకు వెళ్ళాడు కిందటిరాత్రి అతను తనఇంటికి వెళ్ళక బిహారీ ఇంటికి వెళ్ళాడని తెలిసి వినోదిని, "బిహారీ మరిది బాగున్నారా ?'' అని అడిగింది.

"బాగానే ఉన్నాడు పడమర వెళ్ళాడు,'' అన్నాడు మహేంద్రుడు – బిహారీ ఆపూటే వెళ్ళిపోయా డనిపించేటట్టు.

"ఆయన నా సంగతి ఏమీ అడగలేదా ?" అన్న దామె.

"ఏమడుగుతాడు ? ఇదుగో బిహారీ ఉత్తరం," అంటూ అతను ఆమెకు ఆమె ఉత్తరమే అందించాడు.

ఆమె తన ఉత్తరం తీసి చూసుకుని, "దీన్ని మీరు చదివారా ?'' అని అడిగింది, లేదన్నాడు మహేంద్రుడు ఆమెకు ఎప్పుడైనా కనిపిస్తూంటానని చెప్పి, అతను తన సామాను తీసుకువెళ్ళాడు. అతను ఇంటికి చేరేసరికి రాజలక్ష్మి, తనకొడుకు నేదో గ్రహం ఆవేశించి భార్యతో సరిగా ఉండటంలేదని, ఒక పురోహితుణ్ణీ, ఆయన అక్కనూ పిలిపించి, వాళ్ళకు కోడలిచెయ్యి చూపిస్తున్నది

తనకొడుకు మేడమీదికి వెళ్ళటం చూసి రాజలక్ష్మి కోడలిని పైకి తరిమింది. ఆశ గదిదాకా వెళ్ళి లోపలికి అడుగుపెట్టటానికి సంకోచిస్తూ నిలబడింది ఆమెకు మహేంద్రు డెప్పుడూ పరపురుషుడుగానూ, అంతకన్నకూడా పరాయివాడుగానూ కనిపించాడు. మహేంద్రుడు పక్కమీద పడుకుని ఏవో ఆలోచిస్తూ చివరకు గుమ్మంకేసి చూసేసరికి ఆశ వెళ్ళిపోతూ కనిపించింది

కొడుకు భోజనం చేశాక కోడలు అతని దగ్గిరికి వెళ్ళక, కిందనే ఏదోపని పెట్టుకుని కూర్చోవటం చూసి రాజలక్ష్మి చిరాకుపడి, మందలించి, ఆశను పైకి పంపింది ఆమె ఈసారి ధైర్యం చేసి గదిలో ప్రవేశించింది. మహేంద్రుడుకూడా, వినోదిని చూపిన తిరస్కారానికి పగ తీర్చుకోగలందులకు ఆశతో వెనకటిలాగే ఉండా

మనుకున్నాడు కాని తీరా భార్య వచ్చాక అతనికి ఏంమాట్లాడాలో, ఎలామాట్లాడాలో కూడా తెలీలేదు. కాస్సేపు చూసి ఆశ అక్కడినుంచి వెళ్ళిపోయింది

తన చదువుకుగాను మహేంద్రుడు అన్నపూర్ణ ఉంటూవచ్చిన ఇంటిలో చేరాడు అత్తగారి ప్రోద్బలంమీద ఆశ అతని ఎదటికి వెళ్ళి, పక్క ఎక్కడ వేయాలని అడిగితే, తాను అక్కడే పడుకుంటా నన్నాడు. ఆశ వెళ్ళి ఒంటరిగా పడకగదిలో పడుకున్నది ఒక రాత్రివేళ రాజలక్ష్మి ఉబ్బసం మూలాన వగర్చుతూ వచ్చి, కాస్త ఊపిరాడగానే, "బిగుసుకుని ఒక్కత్తెవూ ఇక్కడ పడుకున్నావా ? ఇంత జరిగినా నీకు బుద్ధిరాలేదా ? త్వరగా కిందికి వెళ్ళు" అన్నది

ఆశ మహేంద్రుడివద్దకు వెళ్ళి "అమ్మకు ఆయాసం ఎక్కువగా వుంది ఒకసారి మీరు చూడటం మంచిది," అన్నది.

కొడుకు వచ్చి, "అమ్మా, నీ కాయాసం జాస్తి అయిందా ?'' అని ఆప్యాయంగా అడిగేసరికి రాజలక్ష్మి లోపల సంతోషించి, "అదేమీ లేదు నువు వెళ్ళి పడుకో'' అన్నది కొడుకు వెళ్ళాక ఆమె కోడలిని "నిన్ను పడుకో మని పంపితే వాణ్ని తెచ్చా వెందుకు ? వెళ్ళు,'' అన్నది.

"న న్నిక్కడే వుండమన్నారు" అన్నది ఆశ అత్తకు విసురుతూ.

తన కొడుకును వశం చేసుకునే శక్తి తన కోడలికి లేదని రాజలక్ష్మి గ్రహించింది. తన జబ్బు కారణంగానయినా అతను ఇంటిపట్టున ఉండవచ్చు ననుకుని అదికాస్తా మందులతో నయమైపోతుందని భయపడి, తన కొడు కిచ్చే మందులను రాజలక్ష్మి తాగకుండా పారబొయ్యసాగింది. తన భర్త తల్లి రోగంగురించి అశ్రద్ధగా ఉండటంచేతనే అది అంతకంతకూ పెరుగుతున్న దనుకున్నది ఆశ.

ఈ సమయంలో రాజలక్ష్మికి బిహారీ జ్ఞాపకం వచ్చాడు ఆ సంగతిని గమనించి ఆశ మహేంద్రు డున్నచోటికి వెళ్ళి, "అమ్మ జబ్బుమాట బిహారీ మరిదికి తెలియటం మంచిది," అన్నది

"ఏం ? నా వైద్యంలో నమ్మకం లేదా ?" అన్నాడు మహేంద్రుడు.

"వైద్యం కాదు. తల్లికి సేవ చెయ్యటం నేర్చుకోవాలి," అన్నది ఆశ ధైర్యంగా.

"బిహారీని ఇక్కడి కెందుకు రావద్దన్నదీ నాకు తెలుసు, మళ్ళీ అతను జ్ఞాపకం వచ్చినట్టున్నాడు'' అన్నాడు మహేంద్రుడు.

దెబ్బతిన్నట్టుగా ఆశ పారిపోయింది. తన భర్త అలాంటి మాట అనగలిగినందు కామెకు చచ్చే సిగ్గయింది.

అయినా తల్లికూడా కోరినమీదట అతను బిహారీగురించి వాకబుచేసి, బిహారీ గంగాతీరాన ఒకతోట తీసుకుని తన సామానంతా అక్కడికి తరలించుకుపోయి నట్టు తెలిసింది. వినోదినికూడా అతని వెంట వెళ్ళిపోయిందన్న అనుమానం అతని హృదయంలో తలఎత్తింది అతను తిన్నగా ఆమె ఉండే ఇంటికి వెళ్ళాడు.

వినోదిని వెళ్ళిపోలేదు. ఆమె నిరాశలో ఉన్నది. తన ఉత్తరానికి బిహారీనుంచి జవాబు ఇకరాదు. మహేంద్రుణ్ణి పీడించే కామాతురతనుంచి తప్పించుకోవటం తనకు చాలా కష్టం.

ఆమె మహేంద్రుణ్ణి చూడగానే, "బిహారీ మరిది సమాచారం ఏమన్నా తెలిసిందా?" అని అడిగింది.

"బిహారీ నాకు అబాల్యమిత్రుడే అయినా అతనితో అవసరం నాకన్న నీ కెక్కువగా ఉన్నట్టుందే!" అని మహేంద్రుడు దెప్పాడు ఆమె తనను దూరంగా ఉంచుతున్నందుకు చాలా విధాల నిష్ఠురాలాడాడు. చివర కతను వినోదినితో, "ఇక్కడినుంచి ఎక్కడికైనా పోదాం. ఇక్కడ బతకలేక చచ్చిపోతున్నాను," అన్నాడు.

"సరే, పద ఇప్పుడే పోదాం," అన్నది వినోదిని

# 8

బిహారీ సంగతి కనుక్కరావటానికి బయలుదేరిన మహేంద్రుడు తిరిగి రాలేదు గాని అతనినుంచి ఉత్తరం వచ్చింది తాను పడమర పోతున్నాననీ, తల్లి చికిత్సకు కొత్త డాక్టరును పెట్టాననీ అతను రాశాడు. కొత్త డాక్టరుకూడా ఆ సమయానికే వచ్చాడు. రాజలక్ష్మి వచ్చిన డాక్టరును వచ్చినట్టే పంపేసింది

నడిసముద్రంలో కొట్టుకులాడుతున్న ఆశకు దేవతలాగా అన్నపూర్ణ జ్ఞాపకం వచ్చి, ఆమెను రమ్మని ఉత్తరం రాసింది ఆ ఉత్తరం చూస్తూనే అన్నపూర్ణ కాశీనుంచి చాలాకాలానికి తిరిగివచ్చేసింది ఆమె రాజలక్ష్మి పరిస్థితి చూసి, బిహారీ ఆచూకీ తెలుసుకుని, అతన్ని పిలుచుకురావటానికి బయలుదేరింది

బిహారీ గంగాతీరాన తోట తీసుకుని అందులో చక్కని కుటీరాలు కట్టించి, పేద రోగులకు ఉచితంగా చికిత్స చెయ్యటానికి పూనుకున్నాడు, కాని అతని మనస్సును నిజంగా నిండిఉన్నది వినోదిని

అన్నపూర్ణ రాక అతనికి అమితానందం కలిగించింది రాజలక్ష్మికి చాలా జబ్బుగా ఉన్నదనీ, మహేంద్రుడు వినోదినిని తీసుకుని పడమర వెళ్ళాడనీ, బిహారీ వచ్చి రాజలక్ష్మికి చికిత్స చెయ్యాలనీ అన్నపూర్ణ అనేసరికి బిహారీకి, తాను

వినోదిని గురించి కంటున్న కలలన్నీ కరిగిపోయాయి. అతను రాజలక్ష్మి వద్దకు వెళ్ళి, ఆమెను పరీక్షించాడు.

"న న్నేం పరీక్షిస్తావులే, నాయనా ? దబ్బున పెళ్ళి చేసుకో," అన్నది. రాజలక్ష్మి, చిక్కిపోయిన బిహారీ మెడ తడుముతూ ఆమె నోటివెంట మహేంద్రుడి పేరైనా రాలేదు.

అన్నపూర్ణ అతనితో, "మహేంద్రుణ్ణి ఎలాగైనా తీసుకురాలేవా, బిహారీ ? ఆలస్యం చెయ్యటం మంచిదికాదు," అన్నది, ఆమె దిగులు ఆశ ఇంకెంతోకాలం బతకదని.

మహేంద్రుడి బాంకుకు వెళ్ళి విచారిస్తే అతను అలహాబాదు బ్రాంచిలో డబ్బు తియ్యటమూ, వెయ్యటమూ చేసినట్టు బిహారీకి తెలిసింది

వినోదినీ మహేంద్రులు అలహాబాదు చేరినమాట నిజమే కాని బయలుదేరినది మొదలు వినోదిని మహేంద్రుడి ప్రాణాలు నానావిధాలా కొరుక్కుతిన్నది. బయలు దేరేటప్పుడే ఆమె అతనితోబాటు సెకండుక్లాసు పెట్టెలో ఎక్కక, ఆడవాళ్ళ ఇంటరుక్లాసు పెట్టెలో ఎక్కికూర్చున్నది తాను మహేంద్రునిపైన ఆధారపడినట్టు ప్రవర్తించక తనయిష్టం వచ్చినట్టు ప్రవర్తించి, ఇష్టంవచ్చినచోట మజిలీవేసింది, ఇష్టంవచ్చినప్పుడు తిరిగి ప్రయాణం కట్టింది. రాత్రంతా ప్రయాణాలు, పగలు మజిలీ. ఆమె ప్రవర్తన మహేంద్రుడి కాశ్చర్యమూ, అధైర్యమూ, ఆగ్రహమూ కలిగించింది.

వాళ్లు అలహాబాదునుంచి బయలుదేరే రోజున ఒక సంఘటన జరిగింది. తాము ఎక్కేరైలుకోసం నిరీక్షిస్తూ వినోదిని స్టేషనులో పచారు చేస్తూండగా ఒక అద్దం పెట్టెలో ఆమెకు బట్వాడాకాని ఉత్తరాలమధ్య బిహారీ అనే పేరుతో ఒక ఉత్తరము కనిపించింది. దానిమీద బిహారీ చిరునామా ఉన్నది. కాని దాన్నిబట్టి మనిషి ఆరా తెలియక పోస్టువాళ్ళు ఆ ఉత్తరాన్ని ఆ పెట్టెలో పెట్టారు. బిహారీ పేరుగల వాళ్ళు ప్రపంచంలో ఎందరైనా ఉన్నారు. అయినా వినోదిని ఈ బిహారీ చిరునామా కంఠస్థం చేసుకుని, బెంచీమీద కూర్చునిఉన్న మహేంద్రుడివద్దకు వచ్చి, "నే నింకా కొంతకాలం అలహాబాద్‌లోనే ఉంటాను," అని తెలిపింది

"ఉంటే నువ్వొక్కదానివే ఉండు. నేను వెళ్ళిపోతున్నాను," అన్నాడు మహేంద్రుడు.

వినోదిని సరేనని, కూలివాణ్ణి పిలిచి, తన సామాను పట్టించుకుని స్టేషను బయటికి వచ్చి, బండి మాట్లాడి, అందులో ఎక్కి కూర్చున్నది. మహేంద్రుడు వచ్చినట్టు తానుకూడా ఆమె వెనకనే వచ్చి ఆ బండిలోనే ఎక్కి కూర్చున్నాడు.

వినోదిని బండివాడికి చెప్పిన అడ్రసుగల ఇల్లు ఎక్కడో నిర్జనమైన యమునా తీరాన ఒక తోట మధ్య ఉన్నది

అది బిహారీ ఉండే ఇల్లే, కాని అతనిప్పు డక్కడలేడు ఇంటిని చూసే ముసలి బ్రాహ్మడికి మహేంద్రుడిచేత అద్దె ఇప్పించి, వినోదిని ఆ ఇంటిని బాడుగకు తీసుకున్నది. ఆ రాత్రి మహేంద్రు డామె పడకగదిలో ప్రవేశించటానికి ప్రయత్నించాడు. తాను బిహారీని తప్ప ఇం కెవరినీ ప్రేమించటం లేదని ఆమె స్పష్టంగా అతనితో చెప్పేసింది.

ఈ అవమానంతో మహేంద్రుడి కళ్ళు తెరుపుడుపడ్డాయి. ఆమెమీది వ్యామోహంతో కుక్కలాగా ఆమెవెంట తిరుగుతూ, ఆమె ఆడించినట్లల్లా ఆడుతూ, తానెంత హీనస్థితికి దిగజారినదీ అతను అర్థం చేసుకున్నాడు అతను తన పూర్వ జీవితానికి తిరిగి పోవాలని నిశ్చయించుకుని, తన భార్యకోసమూ, తల్లికోసమూ ఏమైనా కొనాలని బజారుకేసి వెళ్ళాడు

ఆ సమయంలో బిహారీ వచ్చి వినోదిని గదితలుపు తట్టాడు. అతను తనను చూస్తూనే వెనక్కుతిరిగి వెళ్ళిపోవటం కనిపెట్టి వినోదిని, తనమీద ఒట్టుపెట్టి అతన్ని పిలిచింది తాను మహేంద్రుడి వశం కాలేదనీ, తా నింకా బిహారీనే ప్రేమిస్తున్నా ననీ చెప్పింధి అతనితో ఆమె జరిగినదంతా చెప్పింది

వాళ్లు మాట్లాడుకుంటూండగా మహేంద్రుడు తిరిగివచ్చాడు. బిహారీని, వినోదినినీ నిష్ఠురా లాడాడు.

''మహేంద్రా, నేను వినోదినిని పెళ్ళాడబోతున్నాను అందుచేత కాస్త నోరు సంబాళించుకో మీ అమ్మ అక్కడ చావుబతుకుల్లో ఉన్నది నేను వినోదినితో సహా ఈ రాత్రిబండికే బయలుదేరి పోతున్నాను," అన్నాడు బిహారీ.

ఈమాట వింటూనే మహేంద్రు డక్కడ నిలవకుండా వెళ్ళిపోయాడు.

బిహారీ తనను పెళ్ళాడతా నని మహేంద్రుడితో అనటం విని వినోదిని, వితంతువైన తనను పెళ్ళాడే అర్హతా, సమాజంలో బిహారీ పరువు తీసే హక్కూ లేవన్నది...

మహేంద్రుడు చివరకు ఇంటినీ, తల్లినీ, భార్యనూ చేరుకున్నాడు. అతను తన భార్యను చూసి ఆశ్చర్యపోయాడు. ఆశ పూర్తిగా మారిపోయింది. అత్తగారు మంచానపడ్డాక ఇంటిపని అంతా ఎంతో దక్షతతో చూస్తున్నది.

బిహారీ వినోదినీకూడా వచ్చారు. బిహారీ మహేంద్రులను తిరిగి ఒకచోట చూసి రాజలక్ష్మి చాలా సంతోషించింది. ఆమె వాళ్ళిద్దరికీ తన ఎదురుగానే భోజనం



పెట్టించింది ఆమె తన కొడుకునూ, కోడలినీ తన మంచంమీదనే కూర్చోమని, కోడలి చెయ్యి కొడుకుచేతిలో పెట్టి, "ఇటువంటి లక్ష్మి నీ కెక్కడా దొరకదు. దీన్ని నీ చేతిలో పెడుతున్నాను.'' అన్నది ఆమె వినోదినినికూడా క్షమించి మరీ కన్ను మూసింది.

తల్లికి ఉత్తరక్రియలు పూర్తి అయాక మహేంద్రుడు తానుకూడా బిహారీతో కలిసి తోటలో వైద్యం చేస్తానన్నాడు వినోదినికూడా వాళ్ళవెంట ఉంటానన్నది, కాని బిహారీ ఒప్పుకోలేదు ఆమె అతన్ని పెళ్ళాడటానికి ఒప్పుకుంటే ఏలా ఉండేదో.

వినోదిని తన తలకు అన్నపూర్ణ పాదాలవద్ద ఆశ్రయం సంపాదించుకుని, ఆమెతోబాటు కాశీ వెళ్ళిపోయింది